సమగ్ర సమాచార పత్రిక

www.mudranews.in

# ముద్ర

హైదరాబాద్
బుధవారం, 30.09.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 330
పేజీలు: 08 వెల: రూ. 5


ఫార్ములా-ఈ కేసులో

## కేటీఆర్‌కు బిగ్ షాక్

పాస్‌పోర్ట్ జప్తునకు కోర్టు ఆదేశం 02



- కేటీఆర్‌తో పాటు మరో ముగ్గురి పాస్‌పోర్టులు సీజ్ చేయాలని సూచన
- నిధుల దుర్వినియోగం ఆరోపణలపై కొనసాగుతున్న ఏసీబీ దర్యాప్తు
- నిందితులు విదేశాలకు వెళ్లకుండా నిరోధించేందుకే అన్న అధికారులు

రాజకీయాల కోసం

## దేవుళ్లను కూడా విభజిస్తారా

## రేవంత్‌పై బండి ఫైర్



- రాముడు, శివుడి మధ్య రేవంత్ రెడ్డి రాజకీయ చిచ్చు పెడుతున్నారు
- కులం, ప్రాంతం తర్వాత దేవుళ్లను కూడా విభజిస్తున్న కాంగ్రెస్
- దక్షిణ కాశీ, దక్షిణ అయోధ్య ఉన్న రాష్ట్రంలో ఇలాంటి రాజకీయాలు సరికాదు..
- ప్రధాని మోదీ కాశీ విశ్వనాథుని భక్తుడు.. వేములవాడకు వచ్చారు
- ఓట్ల కోసం దేవుళ్లను వాడుకుని, ఇప్పుడు విభజిస్తున్నారని తీవ్ర ఆరోపణ

02

ముద్ర, హైదరాబాద్:



స్పామ్ కాల్స్‌పై

## ట్రాయ్ ఉక్కుపాదం

ఫిర్యాదు లేకుండానే చర్యలు! 02

- స్పామ్ కాల్స్‌ను అరికట్టేందుకు ట్రాయ్ కఠిన నిబంధనలు
- ఫిర్యాదు లేకున్నా ఏఐ సాయంతో స్పామర్లను గుర్తించనున్న టెల్కోలు
- తొలిసారి పట్టుబడితే 15 రోజులు ఔట్‌గోయింగ్ కాల్స్ నిలిపివేత
- పదేపదే చేస్తే ఏడాది పాటు బ్లాక్‌లిస్ట్, కొత్త కనెక్షన్ బంద్

## మహిళలతో కొట్టిస్తాం

నోరు అదుపులో పెట్టుకోకపోతే సహించేది లేదు 02

- పార్టీకి నష్టం కలిగించే వారిపై కఠిన చర్యలు
- ప్రవర్తన మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు
- మాజీ మంత్రి కొండా సురేఖ వార్నింగ్



మోదీపై

# రేవంత్ గురి!

- బీజేపీకి వ్యతిరేకంగా రేవంత్ పోరుబాట
- 'సైమన్ గో బ్యాక్' తరహాలో 'సర్ గో బ్యాక్' ఉద్యమం రావాలి

## ఓట్ల తొలగింపుతో ప్రజాస్వామ్యానికి ముప్పు

### మోదీ సర్కార్‌పై రేవంత్ వ్యాఖ్యలు వైరల్

- ప్రజలంతా ఏకం కావాలి
- ఎన్నికల సంఘంపై ఫైర్
- విపక్షాల ఐక్యతకు రేవంత్ పిలుపు
- '30 కోట్ల ఓట్లు తొలగించే కుట్ర'
- డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం
- దక్షిణాదిని శిక్షించొద్దన్న రేవంత్
- లోక్‌సభ సీటను మరో 25 ఏళ్లు ఫ్రీజ్ చేయాలని డిమాండ్



**ముద్ర, న్యూఢిల్లీ:**
బీజేపీయేతర ముఖ్యమంత్రుల్లో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంత మాటకారి అన్న విషయాన్ని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. పరుషంగా మాట్లాడటమే కాదు.. అవసరానికి అనుగుణంగా కాస్తంత సెన్స్‌బుల్ గా మాట్లాడటం రేవంత్ లో ఉన్న క్వాలిటీగా చెప్పొచ్చు. అదే సమయంలో అందరికి అర్థమయ్యేలా తెలుగులో మాత్రమే కాదు.. ఇంగ్లిషు.. హిందీలోనూ మాట్లాడే నేర్పు రేవంత్‌కు కాస్తంత ఎక్కువే. ప్రధానమంత్రి నరేంద్ర మోడీని నేరుగా టార్గెట్ చేసేలా మాట్లాడే అతి కొద్ది ముఖ్యమంత్రుల్లో రేవంత్ ఒకరు. తాజాగా అసోంకు చెందిన ప్రతిదిన్ దినపత్రిక నిర్వహించిన సదస్సుకు హాజరయ్యారు.
ఈ సందర్భంగా కేంద్రంలోని మోడీ సర్కారుపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల సంఘాన్ని అడ్డు పెట్టుకొని అడ్డగోలుగా ఓటర్లను తొలగిస్తున్న కేంద్ర ప్రభుత్వ ఏకపక్ష విధానాలను అడ్డుకునేందుకు దేశ ప్రజలంతా ఏకం కావాల్సిన రోజు వచ్చిందన్న పిలుపునిచ్చారు. అంతేకాదు.. బ్రిటీష్ వలస పాలనకు వ్యతిరేకంగా అప్పట్లో సైమన్ గో బ్యాక్ ఉద్యమాన్ని గుర్తు చేస్తూ.. సర్ గో బ్యాక్ నినాదాన్ని తెర మీదకు తీసుకురావటం ద్వారా జాతీయ స్థాయిలో అందరి కంట్లో పడటం గమనార్హం. సైమన్ గో బ్యాక్ అని అప్పట్లో దేశ ప్రజలంతా ఏకమై ఉద్యమాన్ని నడిపినట్లే.. ఇప్పుడు సర్ కు వ్యతిరేకంగా అన్ని రాష్ట్రాల ప్రజలు ఏకమై.. దేశ ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. సర్ ను అడ్డుకునేందుకు మమతా బెనర్జీ.. శరద్ పవార్.. ఉద్దవ్ ఠాక్రే.. స్టాలిన్ తదితర విపక్ష నేతలంతా ఏకమవుతారని ఆయన పేర్కొన్నారు. మిగతా 02లో




## రూ.2,700 మందు ₹27వేలా?

### ఔషధాలపై సుప్రీంకోర్టు ఆగ్రహం

- కేంద్రంపై సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు!
- రిటైలర్ ధరకు, విక్రయించే ధరకు భారీ వ్యత్యాసం
- వ్యక్తి చనిపోయినా డెడ్ బాడీ ఇవ్వని కార్పొరేట్ ఆస్పత్రులు
- మందులపై 16% మార్జిన్ ఉండేలా విధానం అవసరం
- ఔషధాల ధరలపై సుప్రీంకోర్టు ఆగ్రహం

**ముద్ర, న్యూఢిల్లీ :**
క్యాన్సర్ తోపాటు ఇతర రోగాల మందులు వైద్య పరికరాల తయారీ, అమ్మకం ధరల వ్యత్యాసంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ముఖ్యంగా క్యాన్సర్ మందుల తయారీ ధరకు, వాటి ఎమ్మార్పీకి మధ్య భారీ వ్యత్యాసం ఉండటంపై కేంద్ర ప్రభుత్వానికి ప్రశ్నలు సంధించింది. మందులు, వైద్య పరికరాల ధరలపై దాఖలైన పిటిషన్ పై సుప్రీం కోర్టు మంగళవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా క్యాన్సర్ మందు తయారీకి 3వేలు అవుతుంటే ఎమ్మార్పీని 27 వేలుగా ఎలా నిర్ణయిస్తారంటూ కేంద్రాన్ని నిలదీసింది.
మందులు, వైద్య పరికరాలను నిత్యావసర సరకులుగా పరిగణించి వాటి ధరలను నియంత్రించేందుకు సమర్థవంతమైన విధానం ఎందుకు తీసుకురావడం లేదని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఔషధాల ధరల విషయంలో 16 శాతం పరిమితిని (క్యాపింగ్) ఎందుకు అమలు చేయడం లేదని నిలదీసింది. క్యాన్సర్ మందుల ఎమ్మార్పీలు వాటి తయారీ వ్యయంతో పోలిస్తే అనేక రెట్లు అధికంగా ఉండటంపై ఉన్నత న్యాయస్థానం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కొన్ని మందుల ధరలు తయారీ ధర కంటే పది రెట్లు అధికంగా ఉండటాన్ని ప్రస్తావిస్తూ ఇలాంటి భారీ వ్యత్యాసాలకు కారణమేంటని ప్రశ్నించింది.
ప్రతి మందు, ప్రతి వైద్య పరికరం ప్రజలకు అవసరమైందేనని అంటూ వాటిని డ్రగ్ ప్రైస్ కంట్రోల్ ఆర్డర్ పరిధిలోకి ఎందుకు తీసుకురావడం లేదని ప్రశ్నించింది. ఔషధాల రీటైలర్ ధరపై 16 శాతానికి మించి లాభం ఎందుకు ఉండాలన్న అంశాన్నీ ధర్మాసనం ప్రస్తావించింది. అధిక ఎమ్మార్పీల కారణంగా ఆయుష్మాన్ భారత్ వంటి ప్రభుత్వ ఆరోగ్య పథకాల ద్వారా ఖర్చు చేస్తున్న కోట్లాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం అవుతోందని అభిప్రాయపడింది.
మరోవైపు ఈ అంశంపై దాఖలైన పిటిషనర్ల వాదనలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకున్నట్లు కోర్టుకు సొలిసిటర్ జనరల్ తెలిపారు. ఔషధ తయారీదారులు, విక్రేతలు, ఆస్పత్రులు, రోగులు.. ఇలా అన్ని పక్షాల ప్రయోజనాలను కాపాడే మార్గాన్ని కేంద్రం కనుగొంటుందని చెప్పారు. ఈ నేపథ్యంలో కేసులో తదుపరి విచారణను కోర్టు అక్టోబర్ 12కు వాయిదా వేసింది.

## మహారాష్ట్రను ఒప్పించండి

తుమ్మిడిహట్టి బ్యారేజీకి అనుమతులు ఇవ్వండి

కేంద్ర జలశక్తిశాఖ మంత్రిని కోరిన సీఎం రేవంత్ 03



## ఆ పోలీసులు ఎవరో గుర్తించాలి..

మహిళా ఎమ్మెల్యేలతో దురుసు ప్రవర్తనపై హైకోర్టు ఆగ్రహం



- సంబంధిత పోలీసుల వివరాలను స్పీకర్‌కు సమర్పించాలని డీజీపీకి సూచన
- వారిపై చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కు ఉందని వ్యాఖ్యానించిన కోర్టు
- సెప్టెంబర్ 7న అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనపై బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ

02

## డబుల్ ఇంజిన్‌తో అభివృద్ధి పరుగులు

పల్లె పండుగ 3.0కు రూ.11,085 కోట్లు 02

- గ్రామాల్లో కొత్త వెలుగులు తీసుకొస్తాం
- సూపర్‌సిక్స్ హామీలన్నీ నెరవేర్చాం
- ఉదయగిరి పండ్లతోటల హబ్‌గా మారుతుంది
- సీఎం చంద్రబాబు



6 నెలలు రేషన్ తీసుకోకుంటే

## కార్డులు రద్దు..

### కేంద్రం సంచలన నిర్ణయం!

- 1.58 కోట్ల మంది లబ్ధిదారుల కార్డులు తాత్కాలిక నిలిపివేత?
- ఈ-కేవైసీ పూర్తిచేస్తే మళ్లీ రేషన్ కార్డు యాక్టివేట్
- నకిలీ, డూప్లికేట్ కార్డుల ఏరివేతకు కేంద్రం చర్యలు
- నిజమైన లబ్ధిదారులకు ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు అవసరం



**ముద్ర, న్యూఢిల్లీ:**
కేంద్ర ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్)లో ఉన్న రేషన్ కార్డుల డేటాను శుభ్రపరిచే ప్రక్రియలో భాగంగా కీలక చర్యలు చేపట్టనుంది. గత ఆరు నెలలుగా తమ రేషన్ కార్డుపై ఎలాంటి ఆహార ధాన్యాలను తీసుకోని.. సుమారు 1.58 కోట్ల మంది లబ్ధిదారుల రేషన్ కార్డులను అక్టోబర్ నుంచి తాత్కాలికంగా నిలిపివేయనుంది.

**మూడు నెలలు గడువు**

లబ్ధిదారుల పేర్లను డేటాబేస్ నుండి వెంటనే తొలగించరు. వారు నిజమైన లబ్ధిదారులని నిరూపించుకోవడానికి మూడు నెలల సమయం ఇస్తూ, మొదట వారి మిగతా 02లో

ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
బుధవారం 30.09.2026
www.mudranews.in | @mudranews



## గుండెపోటు వస్తే.. ఇలా చేయండి



వెంటనే పనులు ఆపి నేలపై లేదా కుర్చీలో సురక్షితంగా కూర్చోవాలి. వీలైతే తల, వీపు ఆధారంగా ఉండేలా చూసుకోవాలి. ఆందోళన పడకుండా నెమ్మదిగా శ్వాస తీసుకోవాలి.

### 6 నెలలు రేషన్ తీసుకోకుంటే
## కార్డులు రద్దు



(మొదటి పేజీ తరువాయి)

రేషన్ కార్డులను తాత్కాలికంగా నిలిపివేస్తారు. ఈ వ్యవధిలోగా వారు ఈ–కేవైసీ ప్రక్రియను పూర్తి చేస్తే, వారి కార్డులను తిరిగి యాక్టివేట్ చేయనున్నట్లు సమాచారం. వినియోగదారు ఆరు నెలలుగా రేషన్ తీసుకోకపోవడానికి కారణాలు చాలానే ఉంటాయి. కాబట్టి ప్రభుత్వం వెంటనే రేషన్ కార్డును వెంటనే నిలిపివేయదు. అందుకే ముందుగా ధృవీకరణకు అవకాశం ఇవ్వడం జరుగుతుంది.

**ప్రభుత్వ చర్యకు కారణం**

నకిలీ, డూప్లికేట్, మరణించిన వ్యక్తుల పేర్లతో ఉన్న లేదా ప్రస్తుతం అర్హత లేని రేషన్ కార్డులను గుర్తించడానికి ప్రభుత్వం ఈ చర్యకు సిద్ధమైంది. దీని వల్ల ప్రభుత్వ రేషన్ నిజమైన లబ్ధిదారులకు చేరుతుందని, రేషన్ ధాన్యాల వృధా తగ్గుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే ఆధార్ అనుసంధానం, డిజిటలైజేషన్, ఈ–కేవైసీ వంటి విధానాలను ఉపయోగించి పీడీఎస్ డేటాబేస్‌ను శుభ్రం చేస్తున్నారు. అయితే.. ఈ విధానంపై కొంత మంది నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీకి చెందిన రాజేంద్రన్ నారాయణన్ ప్రకారం.. రేషన్ తీసుకోని కారణాన్ని ముందుగా తెలుసుకోకుండా, కార్డును నిలిపివేయడం వల్ల నిజమైన లబ్ధిదారులు కూడా ఇబ్బంది పడే అవకాశం ఉంది. సాంకేతిక సమస్యలు, వలసలు లేదా రేషన్ డీలర్‌తో సమస్యల కారణంగా కొంత మంది రేషన్ తీసుకోకపోయి ఉండవచ్చని ఆయన అన్నారు.

మొత్తం మీద.. ప్రభుత్వం రేషన్ వ్యవస్థలో అనర్హమైన, ఉపయోగంలో లేని కార్డులను తొలగించి వ్యవస్థను మరింత పారదర్శకంగా చేయాలని చూస్తోంది. అదే సమయంలో.. నిజంగా అర్హులైన పేదలు పొరపాటున రేషన్ కోల్పోకుండా జాగ్రత్తలు తీసుకోవడం కూడా చాలా ముఖ్యం. అందుకే ఈ ప్రక్రియలో ఈ–కేవైసీతో పాటు లబ్ధిదారుల వాస్తవ పరిస్థితిని కూడా పరిశీలించడం అవసరం.

## మోదీపై రేవంత్ గురి!

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాని నరేంద్ర మోడీ ఏకపక్షంగా ఎన్నికల సంఘం నిర్మాణాన్ని తన సొంత అవసరాలకు వాడుకుంటున్నట్లుగా మండిపడ్డారు. బీజేపీ బ్రిటిష్ జనతా పార్టీగా మారిందన్న సీఎం రేవంత్.. రాజ్యాంగ సభలో సుదీర్ఘంగా చర్చించి ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు కల్పించారనన ఆయన.. 'ఆ తర్వాత జరిగిన అన్ని స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ల(సర్)లో ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించటమే లక్ష్యంగా పని చేశారు. మొదటిసారి ఓట్లు తొలగించటానికి దీన్ని దుర్మార్గంగా వాడుతున్నారు. దేశంలో జనాభా పెరుగుతుంటే ఓట్లు మాత్రం ఎందుకు తగ్గుతున్నాయి? మోడీ.. సీఈసీలు కలిపి కోట్ల కొద్దీ ఓట్లను తొలగిస్తున్నారు. 2014లో మోడీ ప్రధానమంత్రి అయినప్పుడు దేశంలో 81 కోట్ల ఓట్లు ఉంటే.. 2019 నాటికి 91 కోట్లకు.. 2024 నాటికి 97 కోట్లకు చేరాయి. తాజాగా ఇప్పుడు 13 కోట్ల ఓట్లు తొలగించారు. వీటితో పాటు మరిన్ని ఓట్లనుకొ్రీలతో తొలగిస్తున్నారు. మొత్తంగా 30 కోట్ల ఓట్లు తొలగించటమే లక్ష్యంగా పని చేస్తున్నారు'' అంటూ చేసిన విశ్లేషణ ఇప్పుడు కొత్త చర్చకు తెర తీసేలా మారింది.

వాట్సాప్.. సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న వారిని లక్ష్యంగా చేసుకొని ఓట్లు తొలగిస్తున్నట్లుగా ఆరోపణలు చేశారు. మోడీకి అనుకూలంగా ఉండే వారి ఓట్లు మాత్రమే ఉండేలా కుట్ర పన్నుతున్నట్లుగా ఆరోపించారు. బూత్ స్థాయి అధికారికి.. కలెక్టర్ కు ఉండే అధికారాలను సైతం ఢిల్లీలో కూర్చున్న ఎన్నికల సంఘం తన గుప్పిట్లో తీసుకోవటం ఏమిటి? అని ప్రశ్నించారు. ఏఐ టెక్నాలజీని వాడి ఓట్లను తొలగిస్తున్నట్లుగా ఆరోపించారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్ ను ఉత్తరకొరియాకు పంపాలన్నారు. ఆయన్ను కిమ్ దగ్గర శిక్షణ ఇప్పిస్తే.. ప్రధాని మోడీకి దేశంలో నూటికి నూరుశాతం ఓట్లు వేయిస్తారంటూ వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు.

సర్ మీద ఘాటు వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్ లోక్ సభ నియోజకవర్గాల పునర్విభజన పైనా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. దక్షిణాది రాష్ట్రాలను శిక్షించేలా డీలిమిటేషన్ చేపట్టొద్దని.. 1976, 2001 మాదిరి ప్రస్తుత లోక్ సభ సీట్ల సంఖ్యను మరో పాతికేళ్ల పాటు ఫ్రీజ్ చేయాలన్నారు. డీలిమిటేషన్ చేస్తే.. ఉత్తరాది రాష్ట్రాల సీట్లు విపరీతంగా పెరిగి.. దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాభవాన్ని పూర్తిగా దెబ్బ తీస్తుందన్నారు. ఉమ్మడి ఏపీలో ఏపీకి 175 అసెంబ్లీ స్థానాలు ఉండేవని.. తెలంగాణకు 119 స్థానాలు ఉండేవని.. దీంతో ఎప్పుడూ వారు తమపై పెత్తనం చేసేవారననారు. వారి అధిపత్యాన్నీ చూసీ చూసీ పోరాడి తెలంగాణ సాధించుకున్నట్లుగా చెప్పారు. సమాజంలో మైనార్టీలను అణిచివేస్తే విప్లవం వస్తుందన్న రేవంత్.. ఇందిరాగాంధీ.. రాజీవ్ గాంధీ హయాంలో దక్షిణాదికి రాష్ట్రపతి పదవులతో పాటు రక్షణ.. ఆర్థిక.. హోంశాఖ లాంటి కీలక పదవులు దక్కాయన్నారు. మోడీ కోరుకున్నరీతిలో డీలిమిటేషన్ జరిగితే దక్షిణాదికి కేంద్రంలో ప్రాధాన్యం పూర్తిగా తగ్గుతుందన్నారు. మొత్తంగా ఢిల్లీ వేదికగా జరిగిన కార్యక్రమంలో ప్రధాని మోడీపై నేరుగా మాటల్ని తూటాల మాదిరి గురి పెట్టిన వైనం ఇప్పుడు రాజకీయ సంచలనంగా మారింది. ఈ తరహాలో ఇంత ఘాటుగా మోడీకి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేస్తున్న ముఖ్యమంత్రులు లేరన్న మాట వినిపిస్తోంది. ఈ విషయంలో రేవంత్ ఒకేఒక్కడిగా మారినట్లుగా పేర్కొంటున్నారు.



## ఫార్ములా-ఈ కేసులో కేటీఆర్‌కు బిగ్ షాక్



**ముద్ర, హైదరాబాద్:**
రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఫార్ములా–ఈ రేసు కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావుకు ఏసీబీ కోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కేటీఆర్‌తో పాటు మరో ముగ్గురి పాస్‌పోర్టులను తక్షణమే తాత్కాలికంగా జప్తు (ఇంపౌండ్) చేయాలంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కోర్టు హైదరాబాద్ రీజినల్ పాస్‌పోర్టు కార్యాలయాన్ని (ఆర్‌పీవో) ఆదేశించింది. ఈ మేరకు న్యాయస్థానం ఆర్‌పీవోకు అధికారికంగా లేఖ రాసింది. కోర్టు ఆదేశాలతో ఈ కేసు రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ఫార్ములా–ఈ రేసులో నిబంధనలకు విరుద్ధంగా రూ.55 కోట్ల ప్రభుత్వ నిధులు దుర్వినియోగం అయ్యాయని ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏసీబీ విచారణకు ఆదేశించింది. దర్యాప్తు చేపట్టిన ఏసీబీ అధికారులు 2024 డిసెంబరులో అప్పటి పురపాలక శాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్, హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి, స్పోర్ట్స్ కన్సల్టెంట్ కిరణ్ మల్లేశ్వరరావు, ఫార్ములా–ఈ ఆపరేషన్స్ ప్రతినిధి అల్బెర్టో లోంగోలపై కేసు నమోదు చేశారు.

ఈ కేసులో భాగంగా ఇప్పటికే నిందితులందరినీ విచారించి, వారి వాంగ్మూలాలను ఏసీబీ అధికారులు నమోదు చేశారు. అనంతరం కోర్టులో అభియోగపత్రం కూడా దాఖలు చేశారు. ప్రస్తుతం కేసు విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో, నిందితులు విదేశాలకు వెళ్లకుండా నిరోధించేందుకే వారి పాస్‌పోర్టులను జప్తు చేయాలని ఏసీబీ అధికారులు కోర్టును ఆశ్రయించారు. ఈ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం, ఆర్‌పీవోకు ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో ఐదో నిందితుడైన అల్బెర్టో లోంగో విదేశీయుడు కావడంతో, ఆయన పాస్‌పోర్టును జప్తు చేసే అధికారం ఇక్కడి అధికారులకు లేదు. కోర్టు ఆదేశాల నేపథ్యంలో కేటీఆర్‌తో పాటు మిగతా ముగ్గురి పాస్‌పోర్టుల జప్తుపై ఆర్‌పీవో తదుపరి చర్యలు తీసుకోనుంది.

### రాజకీయాల కోసం దేవుళ్లను కూడా
## విభజిస్తారా?

**ముద్ర, హైదరాబాద్ :**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పార్టీ తన ఓటు బ్యాంకు రాజకీయాల కోసం దేవుళ్లను కూడా విభజించే నీచమైన ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. రాముడు, శివుడి మధ్య రాజకీయ విభజన రేఖలు గీస్తూ, ఉత్తర, దక్షిణ భారత దేవుళ్లుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో దుయ్యబట్టారు. "కులాలు, ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు దేవుళ్ల మధ్య కూడా విభేదాలు సృష్టిస్తూ కొత్త హాలాహలాన్ని తయారు చేస్తోంది" అని బండి సంజయ్ విమర్శించారు. దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ, దక్షిణ అయోధ్యగా పిలవబడే భద్రాచలం ఉన్న తెలంగాణకు ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డికి ఈ విషయం తెలియదా అని ప్రశ్నించారు. "మీరు ప్రాతినిధ్యం వహిస్తున్న మహబూబ్‌నగర్‌లోనే హరిహర క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన మన్యంకొండ ఉంది. శివుడు, విష్ణువుల ఐక్యతకు ప్రతీక అయిన ఆ క్షేత్రం గురించి మీకు తెలియదా?" అని నిలదీశారు.

ప్రధాని నరేంద్ర మోదీ కాశీ విశ్వనాథుడైన శివుడికి ప్రాతినిధ్యం వహిస్తున్నారని, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్న మొట్టమొదటి ప్రధాని కూడా ఆయనేనని బండి సంజయ్ గుర్తుచేశారు. "ఎన్నికల సమయంలో దేవుళ్లపై ప్రమాణాలు చేసి ఓట్లు అడిగిన మీరు, ఇప్పుడు అదే ప్రజలను విభజించడానికి దేవుళ్లకు కులం, ప్రాంతం అంటగడుతున్నారు. శివుడి హృదయంలో విష్ణువు, విష్ణువు హృదయంలో శివుడు ఉంటారనేదే సనాతన ధర్మం" అని పేర్కొన్నారు. కాంగ్రెస్ విభజన రాజకీయాలను హిందువులు గమనించాలని, బీజేపీ నేతలు 'హర్ హర్ మహాదేవ్' అనరని చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని, ప్రధాని స్వయంగా నినాదం చేస్తారన్నారు.

## డబుల్ ఇంజిన్‌తో అభివృద్ధి పరుగులు

**ముద్ర, అమరావతి :**
కేంద్రం అండతో రాష్ట్రాభివృద్ధి శరవేగంగా జరుగుతోందని, డబుల్ ఇంజిన్ సర్కార్ జెట్ స్పీడ్‌తో దూసుకెళ్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. నెల్లూరు జిల్లా రామాపురంలో పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ (Pawan Kalyan), భాజపా (BJP) రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌లతో కలిసి చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. ''పల్లె పండుగ 3.0 కోసం రూ.11,085 కోట్ల నిధులు కేటాయిస్తున్నాం. మన పల్లెల్లో కొత్త వెలుగులు వస్తాయి. పవన్ కల్యాణ్.. గ్రామీణాభివృద్ధిశాఖలో అనేక మార్పులు తెచ్చారు. పంచాయతీరాజ్‌శాఖలో పలు కార్యక్రమాలు చేపట్టి నిత్యం పర్యవేక్షిస్తున్నారు. ప్రతి గ్రామంలో తాగునీరు, రోడ్లు, డ్రెయిన్లు, వీధిలైట్లు ఏర్పాటు చేశాం. ఉదయగిరి నుంచి పల్లెల్లో నవోదయానికి నాంది పలికాం. గ్రామాల్లో పేదరికం తగ్గించేందుకు చర్యలు చేపట్టాం. ఉదయగిరి నియోజకవర్గం.. పండ్లతోటల హబ్‌గా మారుతుంది. రెండేళ్ల క్రితం ఉన్న పరిస్థితులు మీరంతా గుర్తుంచుకోవాలి. సూపర్‌సిక్స్ హామీలిచ్చి మాట నిలబెట్టుకున్నాం. అనేక కష్టాలున్నా తట్టుకుని పలు పథకాలు అమలు చేస్తున్నాం. తల్లికి వందనం, స్త్రీ శక్తి ద్వారా మహిళలకు అండగా నిలిచాం. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాం. స్థానిక సంస్థల్లో మాకు అండగా నిలిచేందుకు మీరంతా సిద్ధంగా ఉన్నారు'' అని అన్నారు.

## ఆ పోలీసులు ఎవరో గుర్తించాలి

**ముద్ర, హైదరాబాద్ :**
తెలంగాణ అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల దురుసుగా ప్రవర్తించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు అధికారులను గుర్తించాలని రాష్ట్ర డీజీపీని హైకోర్టు ఆదేశించింది. మంగళవారం ఈ మేరకు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆ అధికారుల వివరాలను సేకరించి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు సమర్పించాలని డీజీపీ సీవీ ఆనంద్‌కు సూచించింది. సెప్టెంబర్ 7న అసెంబ్లీ వర్షాకాల సమావేశాల మొదటి రోజున ఈ ఘటన చోటుచేసుకుంది. నల్ల టీ–షర్టులు ధరించి నిరసన తెలిపేందుకు వెళుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీ గేటు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, ఎమ్మెల్యేలకు మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగింది. ఈ ఘటనలో తమ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు అమర్యాదగా ప్రవర్తించారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయ స్థానం, బాధ్యులైన అధికారులపై అసెంబ్లీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కు ఉంటుందని స్పష్టం చేసింది. ఒక మహిళా ఎమ్మెల్యే చీర లాగారని, మాజీ హోం మంత్రిగా పనిచేసిన మరో మహిళా ఎమ్మెల్యేను మెడ పట్టుకుని నెట్టారని బీఆర్ఎస్ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. శాసనసభ్యులను అసెంబ్లీలోకి వెళ్లకుండా నిలువరించే హక్కు పోలీసులకు లేదని, నిబంధనల ఉల్లంఘన జరిగితే చర్యలు తీసుకోవాల్సింది స్పీకర్ మాత్రమేనని సెప్టెంబర్ 8నే హైకోర్టు తేల్చి చెప్పిన విషయం విధితమే. మరోవైపు, ఈ ఘటనకు సంబంధించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్ రావు సహా పలువురు ఎమ్మెల్యేలపై కేసులు నమోదయ్యాయి. అయితే, తాము ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసులు నమోదు చేయలేదని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ ఇప్పటికే జాతీయ మహిళా కమిషన్, జాతీయ మానవ హక్కుల కమిషన్‌తో పాటు గవర్నర్‌కు కూడా ఫిర్యాదు చేసింది.

## మహిళలతో కొట్టిస్తాం

**ముద్ర, హైదరాబాద్ :**
మాజీ మంత్రి కొండా సురేఖ కీలక వ్యాఖ్యలు చేసారు. మంత్రి పదవి నుంచి బర్తరఫ్ అయిన తరువాత తాము కాంగ్రెస్ లోనే కొనసాగుతామని ప్రకటించిన సురేఖ.. వరుసగా తమ మద్దతు దారులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. వరంగల్ మున్సిపల్ కార్పోరేషన్ ఎన్నికల పైన మంత్రాంగం నడుపుతున్నారు. ఇదే సమయంలో తమను విమర్శించే వారు నోరు అదుపులో పెట్టుకోవాలని.. మహిళలతో కొట్టిస్తామని హెచ్చరించారు. ప్రతిపక్ష నేతల పైనా మండిపడ్డారు.

కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు చేసారు. మంత్రి పదవి పోవటం తనకు బాధగా లేదని చెప్పారు. మంత్రిగా ఉంటే రాష్ట్ర స్థాయిలో సేవ చేసే అవకాశం తనకు ఉండేదని చెప్పుకొచ్చారు. ఇప్పుడు వరంగల్ నియోజకవర్గంపై దృష్టి సారించి అభివృద్ధి చేసే అవకాశం తనకు వచ్చిందని కొండా సురేఖ వెల్లడించారు. ఇకపై నియోజకవర్గంలో అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వెల్లడించారు. వచ్చే వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఎక్కువ స్థానాలను గెలవడమే తమ లక్ష్యమని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నేతలంతా వర్గ విభేదాలను పక్కన పెట్టి పార్టీ కోసం పని చేయాలని పిలుపునిచ్చారు. కొందరు నేతలు నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. ఇష్టానుసారం మాట్లాడితే మహిళలతో చిత్తుచిత్తుగా కొట్టిస్తామని సురేఖ వార్నింగ్ ఇచ్చారు.

కొండా సురేఖ తాజా వ్యాఖ్యలతో ఒక్కో మహిళ నలుగురిని కొడుతుంది జాగ్రత్త.. అంటూ కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. తమ అనుచరులపై ఈగవాలిన ఊరుకోబోమని హెచ్చరించారు. మొన్న ఎంజీఎం దగ్గర బీఆర్ఎస్ నేతలు అత్యుత్సాహం ప్రదర్శించారని ధ్వజమెత్తారు. వాళ్లు వాళ్లే తోసేసుకుని పోలీసులు కొట్టారని ఆస్పత్రిలో జాయిన్ అయ్యారని కొండా సురేఖ విమర్శించారు. కొత్త కలెక్టరేట్ దగ్గర బీజేపీ నాయకులు నిరసన తెలిపి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని ఆగ్రహించారు. వరంగల్ అభివృద్ధిపై బీజేపీ నాయకులకు సవాల్ చేశారు. వరంగల్‌లో పురాతన ప్రదేశాలను అభివృద్ధి చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకువచ్చి.. అప్పుడు మాట్లాడాలని కొండా సురేఖ ఛాలెంజ్ చేశారు. ఇప్పుడు సురేఖ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా కొత్త డిబేట్ కు కారణంగా నిలుస్తున్నాయి.



### మద్రాస్ రెజిమెంట్ ఆయుధాల చోరీ కేసులో
## కీలక మలుపు

**ముద్ర, హైదరాబాద్:**
దేశవ్యాప్తంగా సంచలనం రేపిన బొల్లారంలోని మద్రాస్ రెజిమెంట్ ఆయుధాల చోరీ కేసులో దర్యాప్తు కీలక మలుపు తిరిగింది. మాజీ హవిల్దార్ మల్లేశ్ దగ్గర ఇప్పటికే ఆయుధాలు, తూటాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు.. తాజాగా మరో 810 తూటాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ చోరీ వెనుక మల్లేశ్ ఒక్కడే లేడని తేల్చిన పోలీసులు.. మరో ఇద్దరు ఆర్మీ ఉద్యోగులు, ముగ్గురు ప్రైవేటు వ్యక్తులు సహకరించినట్లు గుర్తించారు. మల్లేశ్ తానొక్కడే చోరీ చేసినట్లు పలుమార్లు చెప్పినా.. పోలీసుల సాంకేతిక దర్యాప్తులో మరికొందరి ప్రమేయం బయటపడింది. ఆయుధాలు భద్రపరిచే ప్రదేశంలోకి మాజీ ఉద్యోగికి నేరుగా ఎలా ప్రవేశం లభించింది? భారీ స్థాయిలో ఆయుధాలను ఒక్కడే ఎలా తరలించగలిగాడు? అనే కోణాల్లో పోలీసులు కూపీ లాగారు. ఏడు రోజుల వ్యవధిలో ఏకంగా 8.5 లక్షల సీడీఆర్‌లను పరిశీలించి.. నిందితుడి వాంగ్మూలం, సాంకేతిక ఆధారాలతో ఐదుగురి పాత్రను నిర్ధారించారు.

పదిరోజుల కస్టడీలో భాగంగా సెప్టెంబరు 22న మల్లేశ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని.. అతడు ఇచ్చిన సమాధానాల ఆధారంగా గతవారం మొత్తం 8 మందిని విచారించారు. చివరకు ఐదుగురు సహకరించినట్లు గుర్తించారు. వీరిలో ఆయుధాగారం వద్ద విధులు నిర్వహించే ఆర్మీ ఉద్యోగులు వినోద్, శేషు ఉండగా.. మరో ముగ్గురు ప్రైవేటు వ్యక్తులు ఉన్నారు. ఆయుధాల చోరీ వెనుక మరేదైనా కుట్ర ఉందా? అన్న కోణంలో పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. మల్లేశ్‌తో వినోద్ ఆర్థిక లావాదేవీలు బయటపడగా.. మిలిటరీ ఇంటెలిజెన్స్ మేజర్ స్థాయి అధికారి సమక్షంలో విచారణ సాగుతోంది.

## స్పామ్ కాల్స్‌పై ట్రాయ్ ఉక్కుపాదం

**ముద్ర, న్యూఢిల్లీ :**
అనవసర స్పామ్ కాల్స్‌తో విసిగిపోతున్న మొబైల్ వినియోగదారులకు ఊరటనిచ్చేలా టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై వినియోగదారుల నుంచి ఫిర్యాదులు అందకపోయినా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికత సాయంతో స్పామ్ కాల్స్‌కు అడ్డుకట్ట వేయాలని టెలికాం సంస్థలను ఆదేశించింది. ఈ మేరకు 'టెలికాం కమర్షియల్ కమ్యూనికేషన్స్ కస్టమర్ ప్రిఫరెన్స్ రెగ్యులేషన్స్'లో నూతన నిబంధనలను పొందుపరిచింది. ఈ కొత్త నిబంధనల ప్రకారం, టెలికాం కంపెనీలు తమ ఏఐ లేదా మెషీన్ లెర్నింగ్ వ్యవస్థల ద్వారా ఏదైనా కాల్‌ను స్పామ్‌గా గుర్తిస్తే, ఆ సమాచారాన్ని రెండు గంటల్లోపు సంబంధిత ఆపరేటర్‌కు నివేదించాలి. సదరు ఆపరేటర్ ఒక పనిదినం వ్యవధిలో ఆ నంబర్‌కు సంబంధించిన కేవైసీ వివరాలను సేకరించి, ఇతర టెలికాం సంస్థలతో పంచుకోవాల్సి ఉంటుంది. గడిచిన 10 రోజుల్లో ఒకే వ్యక్తి లేదా సంస్థకు చెందిన ఐదు కంటే ఎక్కువ నంబర్లు స్పామ్‌గా నమోదైతే, అన్ని టెలికాం సంస్థలు సమన్వయంతో కఠిన చర్యలు చేపడతాయి.

స్పామర్లపై కఠిన చర్యలను కూడా ట్రాయ్ ప్రతిపాదించింది. ఏఐ విశ్లేషణలో మొదటిసారి స్పామర్‌గా నిర్ధారణ అయితే, సదరు వ్యక్తి పేరిట ఉన్న అన్ని కనెక్షన్లపై 15 రోజుల పాటు అవుట్‌గోయింగ్ సేవలను నిలిపివేస్తారు. నిబంధనలను అతిక్రమిస్తూ మళ్లీ అదే తప్పు చేస్తే, ఆ నంబర్లను ఏడాది పాటు బ్లాక్‌లిస్ట్‌లో ఉంచుతారు. అటువంటి వారికి ఏ టెలికాం సంస్థ కూడా కొత్త కనెక్షన్‌లను జారీ చేయదు.

వినియోగదారుల సౌలభ్యం కోసం మరికొన్ని మార్పులను కూడా ట్రాయ్ సూచించింది. ఇకపై కేవలం ప్రమోషనల్ కాల్స్‌ను మాత్రమే నిలిపివేయాలనుకునే వారు, తమ మొబైల్ నుంచి 'BLOCK PROMO' అని టైప్ చేసి 1909 నంబర్‌కు ఎస్ఎంఎస్ పంపితే సరిపోతుంది. ఇప్పటికే 'FULLY BLOCK' సేవను పొందుతున్న వినియోగదారులను 15 రోజుల్లోగా నూతన కేటగిరీకి మారుస్తామని ట్రాయ్ వెల్లడించింది. కాగా, ప్రభుత్వం, బ్యాంకులు, అధీకృత సంస్థల నంబర్లను ట్రూకాలర్ వంటి యాప్‌లు స్పామ్‌గా ట్యాగ్ చేయడాన్ని ట్రాయ్ నిషేధించింది.

## గుండెపోటు లక్షణాలు వస్తే తలుపు అన్‌లాక్ చేయండి

ఇంట్లో ఒంటరిగా ఉంటే ప్రధాన తలుపును అన్‌లాక్ చేసి, సమీపంలో ఉన్న కుటుంబ సభ్యుడు లేదా పొరుగువారికి ఫోన్ చేయాలి. అంబులెన్స్ సిబ్బంది త్వరగా లోపలికి రావడానికి ఇది ఉపయోగపడుతుంది.



## నేడు సిరిసిల్లకు సీఎం రేవంత్ రెడ్డి



**ముద్ర, తెలంగాణ బ్యూరో:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేపు సిరిసిల్ల జిల్లాలో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా తొలుత మధ్యాహ్నం కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ భవన సముదాయాన్ని సీఎం ప్రారంభించనున్నారు. అనంతరం జిల్లాలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. కలెక్టరేట్ లో జిల్లా అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం నిర్వహించి జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, వివిధ శాఖల పనితీరు, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలపై సమీక్షించనున్నారు. అనంతరం సాయంత్రం సీఎం సిరిసిల్లకు చేరుకోనున్నారు. సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తా నుంచి సభా ప్రాంగణం వరకు ర్యాలీగా ముఖ్యమంత్రి వెళ్లనున్నారు. మార్గమధ్యంలో ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు స్వాగతం పలకనున్నారు. సభా ప్రాంగణానికి చేరుకున్న అనంతరం పలు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం నిర్వహించే బహిరంగ సభలో రేవంత్ రెడ్డి ప్రసంగించనున్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

## దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలను సహించం

**- మంత్రి వివేక్ వెంకటస్వామి**
**- దళితులపై వివక్షకు వ్యతిరేకంగా అందరూ ఐక్యంగా పోరాడాలి**



**ముద్ర, న్యూఢిల్లీ:** దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలకు వ్యతిరేకంగా అందరూ ఐక్యంగా పోరాడాలని తెలంగాణ మంత్రి వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు. దళితుల పట్ల వివక్షను ప్రోత్సహించే ఘటనలు సమాజానికి మంచిది కాదని, ఇలాంటి చర్యలపై సంబంధిత ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు స్పష్టంగా స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. న్యూఢిల్లీలో ఎస్సీ, ఎస్టీ పార్లమెంటరీ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన దళిత–ఆదివాసీ ఆత్మగౌరవ సమావేశంలో మంత్రి వివేక్ వెంకటస్వామి పాల్గొని మాట్లాడారు. దేశం నలుమూలల నుంచి ఎస్సీ, ఎస్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఈ సమావేశానికి హాజరై దళిత–ఆదివాసీ వర్గాల ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణపై చర్చించారని తెలిపారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఉత్తరాఖండ్‌లో పాల్గొన్న కార్యక్రమం అనంతరం అక్కడ శుద్ధీకరణ కార్యక్రమం నిర్వహించిన ఘటనను ప్రస్తావించిన మంత్రి వివేక్ వెంకటస్వామి, ఇలాంటి చర్యలు దళితుల ఆత్మగౌరవాన్ని అవమానించేలా ఉన్నాయని అన్నారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణలో కూడా దళితులు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్దకు వెళ్లిన సందర్భంలో శుద్ధీకరణ కార్యక్రమం నిర్వహించిన ఘటనపై ఆయన ప్రస్తావించారు. దళితులకు వ్యతిరేకంగా ఇలాంటి చర్యలు జరిగినప్పుడు రాజకీయాలకు అతీతంగా అందరూ ఖండించాలని అన్నారు.దళితులపై వివక్షకు వ్యతిరేకంగా రాహుల్ గాంధీ స్పష్టమైన వైఖరితో స్పందించారని మంత్రి తెలిపారు. దళితులను అవమానించే, వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలను నేరంగా పరిగణించి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.బీఆర్ఎస్ పాలనలో దళితులకు ఇచ్చిన హామీలు, అమలు చేయని వాగ్దానాలను కూడా మంత్రి వివేక్ వెంకటస్వామి ప్రస్తావించారు. దళిత ముఖ్యమంత్రి హామీ, ప్రతి దళిత కుటుంబానికి మూడు ఎకరాల భూమి వంటి హామీలు అమలు కాలేదని విమర్శించారు. దళితులపై వివక్షకు సంబంధించిన ఘటనలపై కూడా బీఆర్ఎస్ నాయకత్వం తగిన విధంగా స్పందించలేదని ఆరోపించారు. దళితుల ఆత్మగౌరవం, సమానత్వం, రాజ్యాంగ హక్కుల కోసం దేశవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ వర్గాలు ఐక్యంగా ముందుకు రావాలని మంత్రి పిలుపునిచ్చారు. దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు దేశవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీలు ఒకే వేదికపైకి రావడం ఒక కీలకమైన ముందడుగు అని, ఇకపై కూడా ఐక్యంగా పోరాటం కొనసాగించాలని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు.

## పప్పుధాన్యాల సాగులో తెలంగాణకు దేశంలో రెండో స్థానం



**ముద్ర, న్యూఢిల్లీ** : పంటల వైవిధ్యీకరణలో భాగంగా తెలంగాణలో పప్పుధాన్యాల సాగు గత ఖరీఫ్‌తో పోలిస్తే 36 శాతం పెరిగిందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. జాతీయ రబీ సదస్సులో కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు తెలంగాణ రైతుల సమస్యలు, రాష్ట్ర అవసరాలను వివరించారు. కూరగాయల సాగు లక్ష్యాన్ని 8,800 ఎకరాల నుంచి లక్ష ఎకరాలకు పెంచేందుకు కేంద్ర ఆర్థిక సహాయం అందించాలని కోరారు. క్రూడ్ పామ్ ఆయిల్ దిగుమతి సుంకాన్ని 44 శాతానికి పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేయగా, పామాయిల్ ధరలపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు. ఎల్‌నినో, కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు మొక్కజొన్న, జొన్నను పీఎస్ఎస్ పరిధిలోకి తీసుకురావాలని, లోటు వర్షపాత మండలాలకు ప్రత్యేక సాయం అందించాలని తుమ్మల కోరారు. రైతులకు రియల్‌టైమ్ నేల ఆరోగ్య సమాచారం అందించేందుకు శాటిలైట్ ఆధారిత సాయిల్ హెల్త్ టెక్నాలజీని అందుబాటులోకి తేవాలని, తెలంగాణకు అదనంగా 16 కృషి విజ్ఞాన కేంద్రాలు మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరారు. కొడంగల్ అగ్రి బిజినెస్ పార్క్, సెమీ–అరిడ్ హార్టికల్చర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు సహకరించాలని, రైతుల ప్రయోజనాలను కాపాడేలా కొత్త సీడ్ బిల్లును త్వరగా తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

## మేడారం వనదేవతలను దర్శించుకున్న 'ది ప్యారడైజ్' చిత్రబృందం

ముద్ర, తాడ్వాయి: ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో వనదేవతలు సమ్మక్క–సారలమ్మలను 'ది ప్యారడైజ్' చిత్ర బృందం దర్శించుకుంది. కథానాయకుడు నాని, నటుడు సంపూర్ణేష్ బాబు, చిత్ర బృందానికి ఆలయ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. అనంతరం నటుడు నాని వనదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. పూజారులు చిత్ర బృందానికి అమ్మవారి ప్రసాదం అందజేశారు. నానిని చూసేందుకు అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

# దళితులు, బలహీనవర్గాల సంక్షేమం పట్టని కేటీఆర్..

**- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్..**
**- సిరిసిల్లలో ముఖ్యమంత్రి గారి సభను విజయవంతం చేయాలని పిలుపు..**





**ముద్ర, రాజన్న సిరిసిల్ల:** సిరిసిల్ల నియోజకవర్గంలో దళితులు బడుగు బలహీన వర్గాల గా సంక్షేమాన్ని సిరిసిల్ల ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్ ఏనాడు పట్టించుకోలేదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. సిరిసిల్లలో రేపు రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి పాదయాత్ర బహిరంగ సభ ఏర్పాట్లను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, పెద్దపల్లి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ విజయ రమణారావు తో కలిసి మంగళవారం ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి అడ్లూరి మాట్లాడుతూ 2014 నుండి 2023 వరకు మంత్రిగా పనిచేసిన కేటీఆర్ సిరిసిల్ల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు తాము భావించామని మంత్రి అడ్లూరి అన్నారు. ముఖ్యమంత్రి సభ ఏర్పాట్ల సందర్భంగా గడిచిన వారం రోజులుగా సిరిసిల్లకు వస్తున్న సందర్భంగా తమ సమస్యలు పరిష్కరించాలని పెద్ద సంఖ్యలో ప్రజలు తమ వద్దకు వచ్చి విజ్ఞాపనలు చేస్తున్నారని మంత్రి తెలిపారు.

ముఖ్యంగా దళితుల సమస్యలపై కేటీఆర్ కు చిత్తశుద్ధి లేదని సిరిసిల్లలో జరిగిన సంఘటనలను చూస్తే అర్థమవుతుందని అన్నారు. సిరిసిల్లలో కరకట్ట నిర్మాణంతో పాటు సివరేజ్ ప్లాంట్ నిర్మాణంతో దళితులకు అసైన్మెంట్ చేసిన 300 ఎకరాల భూములు సాగుకు నోచుకోవడం లేదని మంత్రి అడ్లూరి అన్నారు. దళితులు బలహీన వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించకపోవడంతో పెద్ద సంఖ్యలో దరఖాస్తులు తీసుకొని సంక్షేమ పథకాలు కావాలని ప్రజలు తమ వద్దకు వస్తున్నారని మంత్రి లక్ష్మణ్ కుమార్ తెలిపారు.

సిరిసిల్ల నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో సమస్యలు నెలకొని ఉన్న నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు సిరిసిల్ల నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 30న భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు బహిరంగ సభకు హాజరై ముఖ్యమంత్రి గారి సభను విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

## ఎస్ఎల్‌బీసీ, కాళేశ్వరం పనులకు ఆర్మీ నైపుణ్యం



**ముద్ర, హైదరాబాద్** : ఎస్ఎల్‌బీసీ సొరంగ నిర్మాణం, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతులు, పునరుద్ధరణ పనులను మరింత పటిష్ఠంగా చేపట్టేందుకు ఆర్మీ ఇంజినీరింగ్ అధికారుల సేవలను వినియోగించుకోవాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ముగ్గురు ఆర్మీ అధికారుల పేర్లను కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ రాష్ట్ర ప్రభుత్వానికి పంపింది. లెఫ్టినెంట్ కల్నల్ సత్యదేవ్ సింగ్, లెఫ్టినెంట్ కల్నల్ రంజిత్ ఏ. మీనన్, లెఫ్టినెంట్ కల్నల్ హెచ్.వి. భల్లాలను డిప్యుటేషన్‌పై తీసుకునే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది.

ఇటీవల ఆర్మీ చీఫ్ జనరల్ ధీరజ్ సేథ్‌ను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కలిసి, సంక్లిష్ట సాగునీటి పనులకు అనుభవజ్ఞులైన ఆర్మీ ఇంజినీర్లను పంపాలని కోరారు. ఇప్పటికే తెలంగాణలో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న కల్నల్ పరీక్షిత్ మెహ్రా సేవలు సంతృప్తికరంగా ఉండటంతో మరికొందరు అధికారుల సేవలను కోరినట్లు ఉత్తమ్ తెలిపారు. ముగ్గురిలో ఒకరిని ఎస్ఎల్‌బీసీ సొరంగ పనుల పర్యవేక్షణకు, మరో ఇద్దరిని కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణకు కేటాయించే అవకాశం ఉంది. పనుల్లో భద్రత, నాణ్యత, ఇంజినీరింగ్ ప్రమాణాల విషయంలో రాజీ ఉండదని మంత్రి స్పష్టం చేశారు.

# రాజ్యాంగంపై నమ్మకం లేకే దళితులపై వివక్ష

**ఆత్మగౌరవం కోసం దేశవ్యాప్తంగా ఐక్యంగా పోరాడాలి: డిప్యూటీ సీఎం భట్టి**



**ముద్ర, తెలంగాణ బ్యూరో:** కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు జరిగిన అవమానం దేశంలోని దళితుల ఆత్మగౌరవానికి అవమానమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఢిల్లీలో కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ ఎంపీల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన దళిత–ఆదివాసీ ఆత్మగౌరవ సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులు, ఆదివాసీల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు దేశవ్యాప్తంగా ఐక్య పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, అస్పృశ్యత నిర్మూలన వంటి విలువలను రాజ్యాంగం అందించిందని, దాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని భట్టి పేర్కొన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీకి రాజ్యాంగంపై నమ్మకం లేదని ఆయన ఆరోపించారు. రాజ్యాంగానికి బదులుగా మనుస్మృతి భావజాలాన్ని ప్రోత్సహించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు.

ఖర్గే సభ అనంతరం హల్ద్వానీలో 'శుద్ధీకరణ' కార్యక్రమం నిర్వహించడం దళితుల ఆత్మగౌరవానికి సంబంధించిన తీవ్రమైన అంశమని భట్టి అన్నారు. ఈ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని రాహుల్ గాంధీ నిరసన చేపడితే, ఆయనపైనే కేసు పెట్టడం అన్యాయమని విమర్శించారు. ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలను రెండో తరగతి పౌరులుగా చూసే పరిస్థితిని అంగీకరించబోమని భట్టి స్పష్టం చేశారు. ప్రతి రాష్ట్రానికి వెళ్లి ప్రజలను చైతన్యపరిచి ఆత్మగౌరవం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. బలహీన వర్గాల హక్కుల పరిరక్షణకు ఐక్యంగా నిలవాలని కోరారు.

# జెన్‌కో కేంద్రాలకు రోజుకు 75,500 టన్నుల బొగ్గు



**ముద్ర, తెలంగాణ బ్యూరో** : ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా తెలంగాణ జెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రాలకు రోజుకు 75,500 టన్నుల బొగ్గు సరఫరా చేసేలా సింగరేణి, జెన్‌కో కార్యాచరణ ప్రణాళిక రూపొందించాయి. మంగళవారం సింగరేణి భవన్‌లో సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి, జెన్‌కో సీఎండీ డాక్టర్ హరీష్ ఆధ్వర్యంలో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ప్లాంట్ల వారీ అవసరాలు, రైల్వే రేకులు, రవాణా సమస్యలపై సమీక్షించారు.

రోజుకు 14 రైల్వే రేకుల ద్వారా 56 వేల టన్నులు, రోడ్డు మార్గంలో 19,500 టన్నుల బొగ్గు సరఫరా చేయాలని నిర్ణయించారు. కొత్తగూడెం ప్లాంట్‌కు 24 వేల టన్నులు, కాకతీయకు 4,500, భద్రాద్రికి 15 వేల, యాదాద్రికి 34 వేల టన్నుల అవసరాలను సమీక్షించారు. యాదాద్రికి నైనీ బొగ్గు బ్లాక్ నుంచి రెండు రేకుల ద్వారా 8 వేల టన్నులు, సింగరేణి గనుల నుంచి ఆరు రేకుల ద్వారా 36 వేల టన్నులు సరఫరా చేయాలని ప్రణాళిక రూపొందించారు.

ఈ నెల 28 నాటికి జెన్‌కో కేంద్రాలకు 15.02 లక్షల టన్నుల బొగ్గు సరఫరా చేసినట్లు అధికారులు తెలిపారు. గత ఏడాది ఇదే కాలంలో 11.44 లక్షల టన్నులు సరఫరా కాగా, ఈసారి 31 శాతం పెరిగింది. బొగ్గు సరఫరా, రవాణా, లోడింగ్, అన్‌లోడింగ్ సమస్యలను ఏరియా జీఎంలు, ప్లాంట్ల సీఈలు సమన్వయంతో పరిష్కరించాలని నిర్ణయించారు. రోజువారీ సమాచార మార్పిడితోపాటు రేకుల సమీకరణ, రవాణాను వేగవంతం చేయాలని సూచించారు.

సమావేశంలో సింగరేణి డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ (ఆపరేషన్స్), కె. వెంకటేశ్వర్లు (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్), జీఎం (కోఆర్డినేషన్, మార్కెటింగ్) టి. శ్రీనివాస్, జెన్‌కో విద్యుత్ కేంద్రాల చీఫ్ ఇంజినీర్లు, సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు.

# తుమ్మిడిహట్టి బ్యారేజీకి అనుమతులు ఇవ్వండి

**- మహారాష్ట్రను ఒప్పించండి - ఎఫ్ఆర్ఎల్ +152 మీటర్లపై స్పష్టత ఇవ్వండి**
**- కేంద్ర జలశక్తిశాఖ మంత్రిని కోరిన సీఎం రేవంత్**





**ముద్ర, న్యూఢిల్లీ** : తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి త్వరగా అనుమతులు ఇప్పించాలని కేంద్ర జలశక్తిశాఖ మంత్రి సీఆర్ పాటిల్ విజ్ఞప్తి చేశారు. దిల్లీలో కేంద్రమంత్రిని కలిసిన సీఎం, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి.. కృష్ణా, గోదావరి బేసిన్లలో తెలంగాణ ప్రాజెక్టులకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర కోరిన సమాచారాన్ని ఇప్పటికే అందించామని ముఖ్యమంత్రి తెలిపారు.తుమ్మిడిహట్టి బ్యారేజీని ఎఫ్ఆర్ఎల్ +152 మీటర్ల స్థాయిలో నిర్మించేందుకు తెలంగాణ, మహారాష్ట్ర మధ్య త్వరగా అంగీకారం కుదిరేలా చూడాలని కోరారు. ఆ స్థాయిలో బ్యారేజీ నిర్మిస్తేనే గ్రావిటీ ఆధారంగా ఎల్లంపల్లికి నీటిని తరలించేందుకు వీలుంటుందని వివరించారు. పాలమూరు–రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల పథకాలు, సీతారామ సాగర్ బహుళార్ధక ప్రాజెక్టు, గౌరవెల్లి రిజర్వాయర్లకు పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనుమతుల జాప్యంతో ప్రాజెక్టుల నిర్మాణ వ్యయం పెరుగుతోందని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర జల సంఘం వద్ద పెండింగ్‌లో ఉన్న అనుమతులను త్వరగా మంజూరు చేయాలని కోరారు. ప్రాజెక్టు డీపీఆర్‌ను సీడబ్ల్యూసీకి సమర్పించామని, నీటిపారుదల ప్రణాళిక, అంతర్రాష్ట్ర అంశాలకు సంబంధించిన అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాజెక్టుకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నుంచి నిరభ్యంతర పత్రం పొందేందుకు తాము చర్చిస్తున్నట్లు చెప్పారు. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ఆధ్వర్యంలో చేపడుతున్న టెలిమెట్రీ యంత్రాలను త్వరగా ఏర్పాటు చేయాలని రేవంత్‌రెడ్డి కోరారు. మొదటి దశ టెలిమెట్రీ యంత్రాల ఏర్పాటుకు అవసరమైన రూ.4.15 కోట్లను తమ ప్రభుత్వం ఇప్పటికే జమ చేసిందన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
బుధవారం 30.09.2026




మీ 'ముద్ర' వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

## కివీని ఇలా తింటేనే
# పోషకాలు



కివీ పండు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని చాలామందికి తెలుసు. అయితే కివీని ఎలా తింటున్నారు? తొక్క తీసేసి లోపలి గుజ్జు మాత్రమే తింటున్నారా? అలా చేస్తే కివీలో ఉండే కొన్ని ముఖ్యమైన పోషకాలను కోల్పోయే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. కివీని ఎంచుకోవడం దగ్గరి నుంచి తినే విధానం వరకు కొన్ని చిన్న మార్పులు చేస్తే మరిన్ని ప్రయోజనాలు పొందొచ్చని సూచిస్తున్నారు.

### పచ్చి కివీని తొక్కతోనే తినొచ్చా?

పచ్చి కివీపై చిన్న చిన్న వెంట్రుకల్లాంటి పొర ఉంటుంది. అందుకే చాలామంది తొక్క తీసేసి తింటారు. కానీ తొక్కతో కలిపి తింటే ఫైబర్ ఎక్కువగా లభిస్తుంది. యాంటీఆక్సిడెంట్లు, పాలీఫినాల్స్ కూడా అధికంగా అందుతాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. జీర్ణక్రియకు ఇది ఉపయోగపడొచ్చు. మలబద్ధకం సమస్య ఉన్నవారికి మల విసర్జన సక్రమంగా ఉండటంలోనూ సహాయపడే అవకాశం ఉంది.

### పొర నచ్చకపోతే ఇలా చేయండి

కివీ తొక్కపై ఉండే వెంట్రుకలు తినడం ఇబ్బందిగా అనిపిస్తే ముందుగా పండును నీటితో బాగా కడగాలి. తర్వాత శుభ్రమైన కిచెన్ టవల్‌తో మెల్లగా రుద్దాలి. దీంతో బయట ఉండే అదనపు వెంట్రుకలు కొంతవరకు తొలగిపోతాయి. ఆ తర్వాత పలుచని ముక్కలుగా కోసుకుని తొక్కతోనే తినొచ్చు.

### గోల్డెన్ కివీ అయితే మరింత సులభం

గోల్డెన్ కివీ తొక్క పచ్చి కివీతో పోలిస్తే పలుచగా, మెత్తగా ఉంటుంది. దీనిపై వెంట్రుకలు కూడా దాదాపు ఉండవు. అందుకే తొక్కతోనే తినడం సులభం. తొక్కతో తింటే కేవలం గుజ్జు తినడంతో పోలిస్తే ఫైబర్, విటమిన్–ఈ, ఫోలేట్ ఎక్కువగా లభిస్తాయని నిపుణులు చెబుతున్నారు.

### రోజుకు ఎన్ని కివీలు తినాలి?

రోజుకు రెండు కివీలు తినడం జీర్ణవ్యవస్థకు ఉపయోగపడొచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. నాలుగు వారాల పాటు రోజుకు రెండు కివీలు తీసుకున్నవారిపై జరిగిన ఓ అధ్యయనంలో మల విసర్జన మరింత సక్రమంగా జరిగినట్లు గుర్తించారు. మల విసర్జన సులభంగా ఉండటంతో పాటు జీర్ణక్రియకు సంబంధించిన అసౌకర్యం కూడా తగ్గినట్లు అధ్యయనంలో తేలింది.

### కివీకి ఫైబర్‌తో పాటు మరో ప్రత్యేకత

కివీలో కరిగే ఫైబర్‌తో పాటు ప్రీబయోటిక్ ఫైబర్ కూడా ఉంటుంది. ఇది పేగుల్లో ఉండే మంచి బ్యాక్టీరియాకు ఆహారంగా పనిచేస్తుంది. దీంతో పేగుల ఆరోగ్యానికి మద్దతు లభించొచ్చు. సాధారణ ఫైబర్ సప్లిమెంట్లు ప్రధానంగా మలానికి పరిమాణాన్ని పెంచేలా పనిచేస్తే.. కివీలో ఉండే వివిధ రకాల ఫైబర్ పేగుల పనితీరుకు మరింత విస్తృతంగా తోడ్పడే అవకాశం ఉంది.

అయితే ప్రతి ఒక్కరి జీర్ణవ్యవస్థ ఒకేలా స్పందించదు. కివీ తిన్న తర్వాత అసౌకర్యం, అలర్జీ వంటి సమస్యలు కనిపిస్తే తినడం ఆపి వైద్య నిపుణులను సంప్రదించడం మంచిది.

## దువ్విన ప్రతిసారీ జుట్టు
# రాలుతుందా?



చాలా మంది అమ్మాయిలకు జుట్టు రాలడం పెద్ద సమస్యగా ఉంది. ఇది వయసుతో సంబంధం లేకుండా ఎంతో మందిని వేధిస్తుంది. అసలు ఇది పోషకాహార లోపం, ఒత్తిడి వలన జుట్టు రాలిపోతూ ఉంటుంది. మీరు ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా ఇంటి చిట్కాలతోనే దీనిని తగ్గించుకోవచ్చు. ఇది పాటిస్తే జుట్టు రాలడం కూడా తగ్గుతుంది.

ఈ పాతకాలం చిట్కాతో మీ జుట్టు ఒత్తుగా, బలంగా ఎలా చేసుకోవాలో చూద్దాం. అయితే, నేటి కాలంలో 10 ఏళ్ళ వయస్సు ఉన్న అమ్మాయిల నుంచే ఈ జుట్టు రాలుతుంది. దీనిని తగ్గించుకోవడం కోసం మార్కెట్లో కొన్ని రకాల ప్రొడక్ట్స్ వాడుతూ ఉంటారు. అలా ఇలా వాడితే సైడ్ ఎఫెక్ట్స్ వచ్చే ప్రమాదం ఉంది. జుట్టు రాలడం మొదలైన రోజు నుంచి ఇది ఫాలో అయితే చాలు. అయితే, దీని కోసం ఒక గిన్నె పెట్టి దానిలో ఒక గ్లాసు నీళ్లు పోసి దానిలో కొద్దిగా టీ పొడి వేసి మరిగించి దానిని డికాషన్ లాగా వడగొట్టాలి. ఈ టీ డికాషన్ జుట్టుకు వాడితే మీ సమస్య తగ్గుతుంది. మరిగిన ఈ టీ డికాషన్ ని మీరు ఒక చిన్న గిన్నెలోకి వడకట్టి దానిలో షాంపూను కూడా కలపాలి. కొద్దీ సేపటి తరవాత దీనిలో కొంచం నిమ్మరసం కూడా కలపాలి. ఈ నిమ్మలో ఉండే గుణాలు తలలో వచ్చే చుండ్రు సమస్యను కూడా తగ్గిస్తుంది. ఇంకా మీ చర్మం కూడా ఆరోగ్యంగా ఉండేలా ఇది చేస్తుంది. అంతే కాదు తలలో ఉన్న చుండ్రును ఆపి జుట్టురాలే సమస్యకు చాలా వరకు తగ్గుతుంది. ఇలా రెండు సార్లు తల స్నానం చేయాలి.

## ఖైరతాబాద్ ఉపఎన్నిక
# కలిసి వచ్చేనా?




ఉప ఎన్నికలు దానం నాగేందర్ తప్పిదం వల్ల వచ్చాయా..? లేదా రేవంత్ రెడ్డి వేసిన ప్లాన్ రివర్స్ గా మారి ఈ ఉప ఎన్నికలకు దారితీసిందా..? క్షుణ్ణంగా పరిస్థితులను గమనిస్తే ఖైరతాబాద్ ఉప ఎన్నికలు మొత్తం దానం నాగేందర్ చుట్టే తిరుగుతున్నాయి. ఈ ఎన్నికలు ఆయనకు మంత్రి పదవిని తెచ్చిపెడతాయా లేక రాజకీయ సమాధి చేస్తాయా చర్చ కొనసాగుతోంది.




జర్నలిస్ట్ & రాజకీయ విశ్లేషకులు
దాసి శంకర్
MA, MEd, LLB


మొత్తంగా ఆరు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి ఒకసారి మంత్రి అయినటువంటి దానం నాగేందర్ ఈ ఎన్నికల్లో పోటీలో ఉంటారా.. పోటీలో ఉంటే ఏ పార్టీ నుండి పోటీ చేస్తారు..? గెలిచే అవకాశాలు ఎంతవరకు ఉన్నాయి..? గెలవకపోతే రాజకీయ సమాధి అవుతుందా..? గెలిస్తే మంత్రి పదవి కాయమా..? అనే చర్చలోకి వెళ్తే 1994, 1999 వరుసగా రెండు సార్లు ఆసిఫ్‌నగర్ నుండి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలిచారు. GHMC కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా కొనసాగుతున్న తరుణంలో 2004 సంవత్సరంలో ఆసిఫ్ నగర్ నుండి మళ్ళీ కాంగ్రెస్ టికెట్ రావాల్సి ఉండగా ఇక్కడ ఒక కీలక మలుపు తిరిగింది. దానం నాగేందర్ అప్పటివరకు పి.జనార్దన్ రెడ్డి అనుచరవర్గంలో ఉండి, 2004 సంవత్సరం వచ్చే సమయానికి వైయస్ రాజశేఖర్ రెడ్డి అనుచర వర్గంలో చేరిపోయారు. వైయస్సార్‌ను నమ్ముకుంటే మంత్రి పదవి వస్తుంది ఎమ్మెల్యే టికెట్ వస్తుందని నమ్మకంతో పీజేఆర్ వర్గం నుండి వైయస్ఆర్ వర్గంలోకి చేరిపోయారు. పిజిఆర్ తెలంగాణలో ఒక నాయకుడిగా వెలుగు వెలుగుతున్న తరుణంలో తన వర్గం నుండి వైయస్ వర్గంలో చేరిన దానం నాగేందర్ కు టికెట్ రాకుండా పీజేఆర్ చేయగలిగాడు అనే చర్చ కూడా రాజకీయ వర్గాలు నడిచింది. ఇక్కడ పిజెఆర్ వర్గంలో ఉన్న టికెట్ వచ్చేదేమో కానీ వైఎస్ నమ్ముకుని కాంగ్రెస్ టికెట్ రాకుండా పోగొట్టుకున్నాడు దానం నాగేందర్ అనే విమర్శలు కూడా దానం నాగేందర్ ఎదుర్కొన్నాడు. కాంగ్రెస్ నుండి టికెట్ రాకపోవడంతో 2004 సంవత్సరంలో ఆసిఫ్ నగర్ నుండి టిడిపి అభ్యర్థిగా బరిలోకి దిగి విజయ దంక మోగించాడు దానం నాగేందర్. అయితే అప్పుడు టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాకుండా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. టిడిపిలో ఉంటే ఏ పనులు కావని కాంగ్రెస్ లోకి వెళితే మంత్రి పదవి కావచ్చు అని టిడిపికి రాజీనామా చేసి ఉప ఎన్నికలకు పోయినటువంటి దానం నాగేందర్ కు చేదు అనుభవం ఎదురై ఎమ్మెల్యేగా ఓడిపోయారు. దీనితో దానంకు ఉప ఎన్నికలు అచ్చిరావు అనే విషయం అర్థమైంది.

**దానం ఎమ్మెల్యేగా ఆరు సార్లు గెలిచారు**

1994–99 లలో వరుసగా రెండు సార్లు ఆసిఫ్‌నగర్ నుండి కాంగ్రెస్, 2004 ఆసిఫ్ నగర్ టీడీపీ నుండి.
2009 – ఖైరతాబాద్ కాంగ్రెస్ నుండి
2018 –ఖైరతాబాద్ – టీఆర్ఎస్
2023 – ఖైరతాబాద్ – బీఆర్ఎస్ నుండి ఎమ్మెల్యేగా గెలిచారు.

ఆయన ఒక్కసారి మాత్రమే మంత్రి అయ్యారు 2009లో వైఎస్ రాజశేఖరరెడ్డి మంత్రివర్గంలో. ఆరోగ్యం, కార్మిక, ఉపాధి, శిక్షణ తదితర శాఖలు ఆయనకు అప్పగించబడ్డాయి. అనంతరం కొణిజేటి రోశయ్య మంత్రివర్గంలోనూ అదే శాఖల్లో కొనసాగారు. ఇంతటి రాజకీయ నేపథ్యం కలిగిన దానం నాగేందర్ రేవంత్ రెడ్డి ట్రాప్ లోకి వెళ్లాడా అనే సందేహాలు కలుగుతున్నాయి.

ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి ఒకసారి మంత్రిగా చేసిన దానం నాగేందర్‌కి 2023 అసెంబ్లీ ఎన్నికలు ఆ తర్వాత వచ్చిన పార్లమెంట్ ఎన్నికలు తన రాజకీయ భవిష్యత్తును అతలాకుతలం చేస్తున్నాయి. 2023లో బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తు మీద గెలిచిన దానం నాగేందర్ అదే పార్టీలో కొనసాగితే ఏ చిక్కు వచ్చేది కాదు. ఒకవేళ బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్ లో చేరాలనుకుంటే 2024లో పార్లమెంటు ఎన్నికల్లో సికింద్రాబాద్ నుండి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేయకుండా ఉంటే బాగుండేది. అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తు పార్లమెంట్ ఎన్నికలలో చేయి గుర్తు ఇదే శత్రువులకు ఆయుధం ఇచ్చినట్లు అయింది. అనంతరం బీఆర్ఎస్ పార్టీకి సంబంధించిన వాళ్ళు స్పీకర్ కి అనర్హుడిగా ప్రకటించాలని వినతి పత్రం ఇవ్వడం, స్పీకర్ దానం నాగేందర్‌కు అనుకూలంగా వ్యవహరించడం, తర్వాత స్పీకర్ తీర్పు నచ్చక ఆ వ్యవహారం హైకోర్టుకు ఆ తర్వాత సుప్రీంకోర్టుకు వెళ్లడం ఆ రెండు కోర్టుల్లో నాగేందర్ కు వ్యతిరేకంగా తీర్పు రావడం అంతా చకచకా జరిగిపోయింది. అసలు సికింద్రాబాద్ నుండి కాంగ్రెస్ పార్టీ తరపున ఎంపీగా నిలబడడానికి కారణం రేవంత్ రెడ్డి మాస్టర్ ప్లాన్. ఎందుకంటే ఖైరతాబాద్ నియోజకవర్గంలో 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ నుండి దానం నాగేందర్ పోటీలో ఉంటే కాంగ్రెస్ పార్టీ నుండి పీజేఆర్ కూతురు విజయ రెడ్డి పోటీలో ఉన్నది. పీజేఆర్ మీద ఉన్న అభిమానంతో విజయ రెడ్డికి లైన్ క్లియర్ చేయడం కోసం దానం నాగేందర్ ను పార్లమెంటుకు పంపిస్తే ఖైరతాబాద్ లో విజయ రెడ్డికి అడ్డు ఉండదు అనేది రేవంత్ రెడ్డి ప్లాన్ గా కనిపిస్తుంది. అయితే పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోవడం వలన చిక్కులు ప్రారంభమయ్యాయి ఒకవేళ సికింద్రాబాద్ లో గెలిస్తే ఢిల్లీ రాజకీయాలకు దానం నాగేందర్ వెళ్లేవాడు. తద్వారా ఖైరతాబాద్ నియోజకవర్గం విజయ రెడ్డి వశం అయ్యేది. ఇక్కడే ప్లాన్ రివర్స్ అయింది. దానం నాగేందర్ ఓడిపోవడం వలన రేవంత్ రెడ్డికి పెద్ద చిక్కులే వచ్చాయి.

ఎంపీ పదవి పోయింది ఉన్న ఎమ్మెల్యే పదవి కూడా పోయింది. రెంటికి చెడ్డ రేవడిలా దానం నాగేందర్ పరిస్థితి మిగిలింది. ఇప్పుడూ ఉప ఎన్నికలు వస్తే దానం నాగేందర్ గెలవకపోతే ఆయన రాజకీయ పరిస్థితి చాలా ఘోరంగా తయారయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటిదాకా జరిగిన ఎన్నికలు ఒక ఎత్తు ఇప్పుడు జరిగే ఈ ఖైరతాబాద్ ఉపఎన్నిక మరొక ఎత్తు. ఎందుకంటే ఎన్నికను కాంగ్రెస్ బీఆర్ఎస్ చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. ఎన్నికల్లో గెలిస్తే దాని ప్రభావం వచ్చే జిహెచ్ఎంసి ఎన్నికలు, అసెంబ్లీ ఎన్నికల మీద పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. గతంలో రెండు ఉప ఎన్నికల్లో కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ సీట్లను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. మరి ఇప్పుడు కూడా ఖైరతాబాద్లో బీఆర్ఎస్ సిట్టింగ్ సీటును కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందా లేదా బీఆర్ఎస్ పార్టీకే ప్రజలు పట్టం కడతారా అనేది వేచి చూడాల్సిందే. ఇక్కడ దానం నాగేందర్ ని జర్నలిస్టులు ఏ పార్టీ నుండి పోటీ చేస్తావు అని అడిగితే ఫలానా పార్టీ నుండి పోటీ చేస్తా అని చెప్పడం పక్కకు పెట్టేసి పోటీ చేసే టైంలో డిసైడ్ చేస్తా అని చెప్పడం వెనక బీఆర్ఎస్ కాంగ్రెస్ దారులు మూసుకుపోకుండా ఉండడం కోసమే అనే చర్చ కొనసాగుతుంది. ఏదేమైనా కాంగ్రెస్ పార్టీ నుండి టికెట్ వస్తే కాంగ్రెస్ నుండి కాంగ్రెస్ నుండి టికెట్ రాకపోతే బీఆర్ఎస్ పార్టీల నుండి పోటీ చేయాలనే ఆలోచనలో దానం నాగేందర్ ఉన్నట్టు తెలుస్తుంది. బీఆర్ఎస్ పార్టీ కూడా బలమైన అభ్యర్థి కోసం వెతుకుతుంది. దానం నాగేందర్ మళ్లీ తిరిగి సొంతగూటికి వస్తే టికెట్ ఇచ్చే ఆలోచనలు కూడా ఉన్నట్టు బీఆర్ఎస్ పార్టీలోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఏదేమైనా రేవంత్ రెడ్డి విజయ రెడ్డికి లైన్ క్లియర్ చేయడం కోసం దానం నాగేందర్ ని బలి చేశారా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. దానం గెలిస్తే మున్నూరు కాపు కోటాలో మంత్రి పదవి వస్తుందా అనేటువంటి చర్చలు కాంగ్రెస్ పార్టీలో జోరుగా చర్చ జరుగుతుంది. చూద్దాం దానం నాగేందర్ రాజకీయ భవిష్యత్తు ఏమిటో..? ప్రజలు ఏమి నిర్ణయిస్తారో..? వేచి చూడాల్సిందే..!

## అగ్రరాజ్యాలు
# కాంప్రమైజ్
### భారత్‌పై మాత్రం టారిఫ్స్

ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కొంతకాలంగా కుదిపేస్తున్న చైనా–అమెరికా వాణిజ్య యుద్ధంలో కీలక మలుపు కనిపిస్తోంది. ప్రపంచంలోని రెండు అతిపెద్ద ఆర్థిక శక్తులు మరోసారి ఢీకొనడం కంటే.. పరస్పర ప్రయోజనాల కోసం కాంప్రమైజ్ దిశగా అడుగులు వేస్తున్నాయి. దాదాపు 30 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులపై పరస్పర సుంకాలను తగ్గించేందుకు ఇరు దేశాలు అంగీకరించాయి. అంతేకాదు.. ఈ పరిధిలోని సుమారు 90 శాతం ఉత్పత్తులపై టారిఫ్‌లను 'మోస్ట్ ఫేవర్డ్ నేషన్' (ఎంఎఫ్ఎన్) రేట్లకు తగ్గించే ప్రతిపాదనకు ఓకే చెప్పాయి.

**30 బిలియన్ డాలర్ల చొప్పున..**

చైనా, అమెరికా మధ్య కుదిరిన తాజా ఏర్పాటులో ఇరుదేశాల నుంచి సుమారు 30 బిలియన్ డాలర్ల విలువైన దిగుమతులు చొప్పున టారిఫ్ తగ్గింపుల పరిధిలోకి రానున్నాయి. అంటే మొత్తంగా దాదాపు 60 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్యానికి ఊరట లభించనుంది. అమెరికా వైపు నుంచి చైనా ఉత్పత్తుల్లో గృహోపకరణాలు, బొమ్మలు, చిన్న ఎలక్ట్రానిక్ వస్తువులు, క్రీడా సామగ్రి వంటి ఉత్పత్తులు ఉన్నాయి. చైనా వైపు అమెరికా నుంచి వ్యవసాయ ఉత్పత్తులు, మాంసం, పాల ఉత్పత్తులు, ధాన్యాలు, వైద్య పరికరాలు, కలప, బొగ్గు వంటి విభాగాలను పరిగణనలోకి తీసుకుంది.

ఇది సాధారణ టారిఫ్ తగ్గింపు మాత్రమే కాదు. వాణిజ్య సంబంధాలను ఒక వ్యవస్థీకృత మార్గంలో నడిపించేందుకు ఇరు దేశాలు యూఎస్–చైనా బోర్డ్ ఆఫ్ ట్రేడ్ ను ఏర్పాటు చేయడం కూడా కీలక పరిణామం. భవిష్యత్‌లో సుంకాలు, మార్కెట్ యాక్సెస్, వాణిజ్య సమస్యలపై చర్చలకు ఇది వేదికగా పనిచేయనుంది.

**ఎందుకు తగ్గారు?**

చైనా, అమెరికా మధ్య టారిఫ్ వార్ కొనసాగితే దాని ప్రభావం కేవలం ఆ రెండు దేశాలకే పరిమితం కాదు. సరఫరా గొలుసులు, తయారీ రంగం, వినియోగదారుల ధరలు, అంతర్జాతీయ పెట్టుబడులు, కమోడిటీ మార్కెట్లు అన్నింటిపైనా ప్రభావం పడుతుంది. అందుకే రెండు దేశాలు పూర్తి స్థాయి వాణిజ్య యుద్ధం కంటే.. నియంత్రిత పోటీ, పరిమిత సహకారం అనే మార్గాన్ని ఎంచుకున్నట్లు కనిపిస్తోంది. అయితే దీనిని పూర్తి స్థాయి వాణిజ్య ఒప్పందంగా చూడటం తొందరపాటు అవుతుంది. సెమీకండక్టర్లు, ఎలక్ట్రిక్ వాహనాలు వంటి కీలక వ్యూహాత్మక రంగాలు తాజా టారిఫ్ తగ్గింపుల పరిధిలో లేవు. అంటే.. ఫైటింగ్‌కు తాత్కాలికంగా బ్రేక్ పడినా అసలు పోటీ మాత్రం కొనసాగుతూనే ఉంది.

**రష్యా చమురు అంశంలో చైనాకు ఊరట?**

ఇక్కడే ఈ పరిణామానికి మరో కీలక కోణం ఉంది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న దేశాలపై అమెరికా కఠిన చర్యలకు సిద్ధమవుతోంది. చైనా, భారత్ వంటి దేశాలు రష్యా చమురు కొనుగోళ్ల కారణంగా 100 శాతం వరకు అదనపు టారిఫ్‌ల ముప్పును ఎదుర్కొంటున్నాయి. అయితే చైనా–అమెరికా మధ్య తాజాగా కుదిరిన వాణిజ్య అవగాహనతో బీజింగ్‌కు కొంత ఊరట లభించే అవకాశం కనిపిస్తోంది. అయితే ఇక్కడ ఒక విషయం స్పష్టంగా గుర్తుంచుకోవాలి. తాజా చైనా–అమెరికా టారిఫ్ ఒప్పందం అంటే రష్యా చమురు కొనుగోళ్లపై ప్రతిపాదించిన ప్రతి అమెరికా చర్య నుంచి చైనాకు శాశ్వత మినహాయింపు లభించిందని అర్థం కాదు. ప్రస్తుత ఒప్పందం ప్రధానంగా ఎంపిక చేసిన వస్తువులపై పరస్పర టారిఫ్ తగ్గింపులకు సంబంధించినది. కాబట్టి రష్యా అంశంపై అమెరికా భవిష్యత్ నిర్ణయాలను చూడాల్సి ఉంటుంది.

**మరి భారత్ పరిస్థితి ఏంటి?**

ఇదే ఇప్పుడు న్యూఢిల్లీకి అసలు ఆందోళన. ఒకవైపు చైనా–అమెరికా వాణిజ్య సంబంధాలు క్రమంగా చర్చలు, టారిఫ్ తగ్గింపుల దిశగా వెళ్తుంటే.. మరోవైపు రష్యా చమురు కొనుగోళ్ల విషయంలో భారత్‌పై అమెరికా ఒత్తిడి కొనసాగుతోంది. రష్యా నుంచి చమురు కొనుగోళ్లపై కొత్త టారిఫ్ చర్యలు ద్వైపాక్షిక సంబంధాలపై ప్రభావం చూపవచ్చని భారత్ ఇప్పటికే అమెరికాకు చెప్పింది. అందుకే చైనా–అమెరికా తాజా కాంప్రమైజ్‌ను భారత్ కేవలం వాణిజ్య వార్తగా చూడలేం. ఇది భవిష్యత్‌లో అమెరికా–భారత్ వాణిజ్య చర్చలపై కూడా ప్రభావం చూపే అంశంగా మారొచ్చు. చైనాకు టారిఫ్ ఒత్తిడి నుంచి కొంత శ్వాస తీసుకునే అవకాశం లభిస్తే.. భారత్‌కు మాత్రం రష్యా చమురు అంశంలో అమెరికాతో సున్నితమైన దౌత్య, ఆర్థిక సమతుల్యత అవసరం అవుతుంది.

**ఇది శాశ్వత శాంతేనా?**

ప్రస్తుత పరిణామాలను చూస్తే.. చైనా, అమెరికా పూర్తిగా శత్రుత్వాన్ని పక్కన పెట్టినట్లు చెప్పలేం. అసలు సమస్యలు ఇంకా అలాగే ఉన్నాయి. వాణిజ్య లోటు, టెక్నాలజీ ఆధిపత్యం, సెమీకండక్టర్లు, ఎలక్ట్రిక్ వాహనాలు, పెట్టుబడులు, వ్యూహాత్మక సరఫరా గొలుసులు వంటి అంశాల్లో ఇరు దేశాల మధ్య పోటీ కొనసాగుతోంది. కాబట్టి తాజా డీల్‌ను 'ట్రేడ్ వార్‌కు ముగింపు' కంటే 'ట్రేడ్ వార్‌కు తాత్కాలిక విరామం' గా చూడటం సరైనదని విశ్లేషకుల అభిప్రాయం. ఇరు దేశాలు ఒకరిపై ఒకరు పూర్తిగా ఆధారపడకుండా.. తమ ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకుంటూనే అవసరమైన చోట సహకరించుకునే కొత్త మోడల్‌ను రూపొందిస్తున్నాయి. చైనా–అమెరికా మధ్య తాజా టారిఫ్ తగ్గింపు ప్రపంచ మార్కెట్లకు కొంత స్థిరత్వాన్ని ఇవ్వొచ్చు. కానీ అసలు పరీక్ష మాత్రం రాబోయే నెలల్లో ఉంటుంది. సుంకాలు తగ్గించడం సులభమే.. కానీ వ్యూహాత్మక విభేదాలను తగ్గించడం ఎంతవరకు సాధ్యమవుతుందన్నదే అసలు ప్రశ్న.



### గుండెపోటు లక్షణాలు వస్తే

తినడం, తాగడం మానేయండి. గుండెపోటు అనుమానం ఉన్న సమయంలో ఆహారం, నీరు లేదా ఇంటి చిట్కాలు తీసుకుంటూ సమయం వృథా చేయకూడదు. వాంతులు లేదా స్పృహ కోల్పోయే ప్రమాదం ఉండటంతో నోట్లో ఏదీ తీసుకోవడం సురక్షితం కాకపోవచ్చు.



# కేటీఆర్.. అసత్య ప్రచారాలు వద్దు

**నా ప్రజల కోసం పోరాడుతూనే ఉన్నా..**
**భూ సమస్యలపై గత ప్రభుత్వాలకు ఎన్నిసార్లు విన్నవించానో ఆధారాలు ఉన్నాయి**
**రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**



**ముద్ర ప్రతినిధి, రాజేంద్రనగర్:** తన నియోజకవర్గ ప్రజల భూ సమస్యల పరిష్కారం కోసం గత ప్రభుత్వాల నుంచి ప్రస్తుత ప్రభుత్వం వరకు నిరంతరం పోరాడుతున్నానని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు. తాను అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌తో పాటు అధికారులను పలుమార్లు కలిసి వినతిపత్రాలు ఇచ్చినా, ఇప్పుడు తనపై కేటీఆర్ అసత్య ఆరోపణలు చేయడం బాధాకరమని పేర్కొన్నారు.పాదరగూడలో జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రి కేటీఆర్.. రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని భూ సమస్యలను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ గతంలో తమ దృష్టికి తీసుకురాలేదని చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే స్పందించారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2022 డిసెంబర్ 22న అప్పా జంక్షన్ వద్ద శంషాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రోకు శంకుస్థాపన సందర్భంగా జరిగిన బహిరంగ సభలోనే బహదూర్‌గూడ, గాస్మియాగూడ భూ సమస్యలను కేసీఆర్, కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లానని గుర్తుచేశారు.శంషాబాద్ మండలంలోని కొత్వాల్‌గూడ ఎన్‌మీ ప్రాపర్టీస్, భూదాన్ భూములు, సుల్తాన్‌పల్లి, మల్కారం, జూకల్, రామంజాపూర్, పెద్దగోల్కొండ, చౌదరిగూడ, నర్కుడా, పెద్దషాపూర్ తదితర ప్రాంతాలతో పాటు అత్తాపూర్ భూపాల్‌నగర్, జలాల్‌బాబా నగర్, రాజేంద్రనగర్ హనుమాన్‌నగర్, గండిపేట మండలంలోని వట్టినాగులపల్లి భూ సమస్యలపై కూడా గత ప్రభుత్వాన్ని పలుమార్లు సంప్రదించానని తెలిపారు.2017 నవంబర్ 6న అసెంబ్లీలో జలాల్‌బాబానగర్, భూపాల్‌నగర్, హనుమాన్‌నగర్ భూ సమస్యలను ప్రస్తావించిన విషయాన్ని గుర్తుచేశారు. 2020, 2022, 2023 సంవత్సరాల్లో కేసీఆర్, కేటీఆర్‌తో పాటు అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చానని చెప్పారు. అప్పటి సీఎస్ సోమేశ్‌కుమార్‌ను స్వయంగా కలిసి శంషాబాద్ మండల భూ సమస్యలపై వినతిపత్రం అందజేశానన్నారు.జిల్లా కలెక్టర్, అప్పటి ఆర్డీఓ చంద్రకళను కలిసి సమస్యల పరిష్కారానికి విజ్ఞప్తి చేశానని, తహసీల్దార్ నుంచి కలెక్టర్, కమిషనర్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ వరకు జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలకు సంబంధించిన ఆధారాలు తన వద్ద ఉన్నాయని ప్రకాష్ గౌడ్ తెలిపారు. మాజీ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి ద్వారా కూడా గత ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్లానన్నారు.ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ భూ సమస్యల పరిష్కారం కోసం తన పోరాటం కొనసాగుతోందని చెప్పారు. ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లోనూ ఈ సమస్యలను గట్టిగా ప్రస్తావించానని తెలిపారు. ప్రజలు తనను నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించారని, వారి భూ సమస్యలు పరిష్కరిస్తే తన జన్మ ధన్యమవుతుందని స్పీకర్ ద్వారా ప్రభుత్వాన్ని కోరిన విషయాన్ని గుర్తుచేశారు.వచ్చే అసెంబ్లీ సమావేశాల నాటికి సమస్యలకు పరిష్కారం చూపకపోతే అసెంబ్లీ పోడియం ముందు ధర్నాకు కూడా వెనుకాడబోనని స్పష్టం చేశారు. ప్రజల ఆస్తులు, హక్కులను కాపాడటం తన బాధ్యత అని పేర్కొన్న ప్రకాష్ గౌడ్.. రాజకీయ లబ్ధి కోసం తనపై అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని కేటీఆర్‌కు సూచించారు. తన ప్రజల పక్షాన భూ సమస్యల పరిష్కారం కోసం పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా..
# వాకథాన్, ఉచిత వైద్య శిబిరం

**406 మందికి ఉచిత వైద్య సేవలు**



**ముద్ర, కూకట్‌పల్లి:** ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని రామ్‌దేవ్‌రావు హాస్పిటల్ ఆధ్వర్యంలో వాకథాన్, ఉచిత కార్డియాలజీ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. హృదయ సంబంధిత వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు ముందస్తు వైద్య పరీక్షల ప్రాధాన్యాన్ని తెలియజేయడం కార్యక్రమం ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.వరల్డ్ హార్ట్ ఫెడరేషన్ కార్యక్రమంలో భాగంగా కుముదినీదేవి కాలేజ్ ఆఫ్ నర్సింగ్, లయన్స్ క్లబ్ ఆఫ్ సనాతన సహకారంతో వాకథాన్ నిర్వహించారు. రేకీ థెరపీ గ్రాండ్ మాస్టర్, రచయిత్రి, ఫ్యామిలీ కౌన్సిలర్ లక్ష్మీ కమలాకర్ జెండా ఊపి వాకథాన్‌ను ప్రారంభించారు. నిత్యం వ్యాయామం చేయడం, సమతుల ఆహారం తీసుకోవడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఆమె సూచించారు.కార్యక్రమంలో కార్డియాలజిస్టులు డా. ప్రదీప్‌రెడ్డి, డా. శ్రీకాంత్‌తో పాటు వివిధ విభాగాలకు చెందిన వైద్యులు, నర్సింగ్ విద్యార్థులు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు. గుండె జబ్బుల నివారణకు క్రమం తప్పకుండా వ్యాయామం చేయడంతో పాటు బీపీ, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రణలో ఉంచుకోవాలని వైద్యులు సూచించారు.406 మందికి ఉచిత వైద్య పరీక్షలురామ్‌దేవ్‌రావు హాస్పిటల్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించిన ఉచిత కార్డియాలజీ శిబిరానికి విశేష స్పందన లభించింది. మొత్తం 406 మంది వైద్య సేవలను వినియోగించుకున్నారు. శిబిరంలో బీపీ, జీఆర్‌బీఎస్, ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలతో పాటు కార్డియాలజిస్టులతో ఉచిత వైద్య సంప్రదింపులు అందించారు.హాస్పిటల్ మేనేజ్‌మెంట్ మార్గదర్శకత్వంలో డా. కమలాకర్, డా. ప్రదీప్‌రెడ్డి, డా. యోబు ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమ విజయానికి సహకరించిన వైద్యులు, సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు, లయన్స్ క్లబ్ సభ్యులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆరోగ్యం తమ బాధ్యతగా భావించి భవిష్యత్తులోనూ సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని హాస్పిటల్ యాజమాన్యం పేర్కొంది.

# బాపుఘాట్ వద్ద శాశ్వత పరిష్కారానికి ముందడుగు



ముద్ర ఎఫెక్ట్



**ముద్ర ప్రతినిధి, రాజేంద్రనగర్:** ఎట్టకేలకు బాపూ సమాధి వద్ద నెలకొన్న సమస్యల శాశ్వత పరిష్కారానికి ముందడుగు పడింది. దక్షిణ భారతదేశంలో అది కూడా మన నగరంలో ఉన్న ఏకైక గాంధీ సమాధిని గాలికి వదిలేశారు. గాంధీ జయంతి, వర్ధంతి రోజుల్లో మాత్రమే గవర్నర్ ముఖ్యమంత్రి రాకల సందర్భంగా ఆర్భాటాలు చేసి బాపు ఘాట్ ను పైపై ముస్తాబులు చేస్తున్నారు. పాపు సమాధి పరిసర ప్రాంతాలు చెత్త, చెట్లు బురదతో నిండిపోయి ఆకతాయిలకు నిలయంగా మారింది. ఈ విషయమై సోమవారం గాంధీజీ సమాధి పట్ల ఇంత నిర్లక్ష్యమా? అని శీర్షికతో ముద్రలో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన కలెక్టర్ ప్రియాంక, జోనల్ కమిషనర్ ఉదయ్ లు బాపు ఘాట్ లో పర్యటించి సంబంధిత అధికారులు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం విధితమే. త్వరితగతిన నిధులు మంజూరు చేసి ఇక్కడ కంచ వేయాలని, అండర్ గ్రౌండ్ పైప్ లైన్లు కూడా వేయాలని ప్రతిపాదనలు పెట్టారు. ప్రస్తుతం గాంధీ సమాధి ప్రాంతాలను పారిశుద్ధ్య కార్మికులు పూర్తిగా శుభ్రం చేసి గాంధీ జయంతికి ముస్తాబు చేస్తున్నారు. అధికారుల నిర్ణయంతో గాంధీయవాదులు, స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## నూతన డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



**ముద్ర కూకట్‌పల్లి / శేరిలింగంపల్లి :** ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని మహావీర్ నగర్, కాజా నగర్, గణేష్ నగర్, మహాత్మా గాంధీ నగర్ మరియు కమలమ్మ కాలనీలలో రూ.20 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (UGD) పైప్‌లైన్ పనులకు పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (PAC) చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాసరావు మరియు జలమండలి ఉన్నతాధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పిఎసి చైర్మన్ గాంధీ మాట్లాడుతూ... నియోజకవర్గంలో భూగర్భ డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే తమ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. స్థానిక ప్రజల నుంచి వచ్చిన వినతులను పరిగణనలోకి తీసుకుని, ప్రత్యేక చొరవతో ఈ పనులను మంజూరు చేయించినట్లు తెలిపారు. నిత్యం డ్రైనేజీ పొంగుతూ కాలనీవాసులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ప్రథమ ప్రాధాన్యత కింద రూ.20 లక్షల వ్యయంతో శంకుస్థాపన చేసుకున్నామని పేర్కొన్నారు.నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలి:అభివృద్ధి పనుల నిర్మాణంలో ఎలాంటి నాణ్యతా లోపాలు ఉండకూడదని, ప్రమాణాలకు అనుగుణంగా పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తూ, స్వచ్ఛమైన మంచినీటి సరఫరాతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు.మాన్య ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి మార్గదర్శకంలో సంక్షేమం, అభివృద్ధిని సమతుల్యం చేస్తూ శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన మరియు అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి శాయశక్తులా కృషి చేస్తానని గాంధీ తెలిపారు.ఈ కార్యక్రమంలో జలమండలి DGM శ్రీనివాసరాజు, మేనేజర్ అనిల్, స్థానిక నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు మరియు కాలనీవాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పాస్‌వర్డ్ మనది.. పని 'ఏఐ'ది..

### తిరుమల బుకింగ్ ప్రయత్నం లేవనెత్తిన కొత్త ప్రశ్నలు




ఓ తిరుమల దేవుడా.. నీ దర్శనానికి సరిపోని మానవ తెలివితేటలకు తోడు.. ఇప్పుడు కొత్తగా ఏఐ కూడా లైన్లో నుంచుండ పెట్టావా స్వామి? అని అనే రోజులు వచ్చేశాయి..టీటీడీ సైట్‌లో రూమ్ బుక్ చేయడానికి మనుషులే సర్వర్ డౌన్లతో కళ్ళు కాయలు కాచేలా వేచి చూస్తుంటే మధ్యలో ఒక చాట్‌బాట్ వచ్చి "నేనున్నాగా.. పాస్‌వర్డ్ ఇవ్వు బాస్ కథ నడిపిస్తా" అని వెబ్‌సైట్‌లోకి దూరింది. కాకపోతే చివరికి పేమెంట్ గేట్‌వే దగ్గర నిలబడి "దర్శనం టికెట్ ఎక్కడ నాయనా?" అనేసరికి పాపం ఏఐ ఏజెంట్‌కి కూడా భక్తి, ముక్తి, భయాల అసలు అర్థం ఏంటో తెలిసివచ్చింది.. ఇప్పటివరకు ఏఐ అనగానే మన సందేహాలకు సమాధానాలు ఇచ్చే ఒక డిజిటల్ అసిస్టెంట్ మాత్రమే గుర్తొచ్చేది. కానీ అదే ఏఐ మన తరఫున ఒక వెబ్‌సైట్‌లోకి లాగిన్ అయి.. బ్రౌజ్ చేస్తూ.. ఆప్షన్లు ఎంచుకుని ఒక పనిని పూర్తి చేయడానికి ప్రయత్నిస్తే ఎలా ఉంటుంది? ఇటీవల తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) వెబ్‌సైట్‌లో జరిగిన ఒక కాటేజ్ బుకింగ్ ప్రయత్నం సరిగ్గా ఈ కొత్త టెక్నాలజీ పరిణామాన్నే మన కళ్లముందు నిలిపింది.అసలు తిరుమల బుకింగ్‌లో ఏం జరిగింది?ఇటీవల చాట్ జీపీటీ –6 ఆస్ట్రా అనే ఏఐ ఏజెంట్ ద్వారా టీటీడీ వెబ్‌సైట్‌లో రూమ్స్ బుక్ చేసేందుకు ఒక ప్రయత్నం జరిగింది. అయితే ఇక్కడ స్పష్టం చేయాల్సిన విషయమేమిటంటే.. ఈ బుకింగ్ పూర్తికాలేదు. ప్రక్రియ కేవలం పేమెంట్ స్టేజ్ వరకు మాత్రమే వెళ్లి ఆగిపోయింది. టీటీడీ నియమాల ప్రకారం గది పొందడానికి చెల్లుబాటు అయ్యే దర్శన టికెట్ తప్పనిసరి. కాబట్టి ఏఐ భద్రతా వ్యవస్థలను దాటేసి బుకింగ్ పూర్తి చేసిందని చెప్పలేం.అయితే ఇక్కడ గమనించాల్సిన అసలు విషయం ఏఐ ఏజెంట్ పనితీరు. యూజర్ లాగిన్ వివరాలు ఇచ్చిన తర్వాత ఈ ఏఐ ఏజెంట్ స్వయంగా వెబ్‌సైట్‌ను నావిగేట్ చేయడం.. డేట్స్ అందుబాటులో ఉన్న ఆప్షన్లను గుర్తించి సెలెక్ట్ చేయడం.. ప్రాసెస్ ముందుకు తీసుకెళ్లడం వంటి పనులను విజయవంతంగా చేసింది.సాధారణ చాట్ జీపీటీకి, ఏఐ ఏజెంట్‌కు తేడా ఏమిటి?ఒక సాధారణ చాట్‌బాట్‌ను "తిరుమలలో రూమ్ ఎలా బుక్ చేయాలి?" అని అడిగితే అది కేవలం బుకింగ్ విధానాన్ని స్టెప్–బై–స్టెప్ వివరిస్తుంది. కానీ ఏఐ ఏజెంట్ అక్కడితో ఆగదు. యూజర్ నుండి తగిన అనుమతులు.. లాగిన్ వివరాలు పొందితే నేరుగా బ్రౌజర్‌ను రన్ చేస్తూ వెబ్‌సైట్‌లోకి వెళ్లి పేజీలను ఓపెన్ చేసి.. మనం చేయాల్సిన పనిని దాదాపుగా పూర్తి చేస్తుంది. అంటే సమాచారం ఇచ్చే స్థాయి నుండి, స్వయంగా పని చేసే స్థాయికి టెక్నాలజీ ఎదుగుతోంది.భవిష్యత్తు సౌకర్యాలు.. కొత్త సవాళ్లుఈ సాంకేతికత మరింత అభివృద్ధి చెందితే రైలు, విమాన టికెట్లు, హోటల్ రిజర్వేషన్లు, ఆన్‌లైన్ షాపింగ్, బిల్లుల చెల్లింపులు వంటి రోజువారీ పనులను మన ప్రతినిధిగా ఏఐ చేసేస్తుంది. దీనివల్ల సమయం చాలా ఆదా అవుతుంది. అయితే నాణేనికి మరోవైపు ప్రమాదాలు కూడా ఉన్నాయి. మన పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు, బ్యాంకింగ్ వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని ఏఐ ఏజెంట్లకు ఇవ్వడం ఎంతవరకు సురక్షితం? ఒకవేళ ఏఐ పొరపాటున తప్పుడు తేదీకి టికెట్ బుక్ చేసినా లేదా ఎక్కువ మొత్తంలో చెల్లింపులు చేసినా ఆ నష్టానికి బాధ్యత ఎవరిది?బ్యాంకింగ్, ప్రభుత్వ , ఇ–కామర్స్ సైట్లు ఈ ఏఐ ఏజెంట్లను ఎలా గుర్తిస్తాయి? పేమెంట్ లేదా ఫైనల్ కన్ఫర్మేషన్ సమయాల్లో మనుషుల అనుమతి తప్పనిసరి చేసేలా ఎలాంటి నిబంధనలు తీసుకరావాలి? అనే అంశాలపై ఇప్పుడు తీవ్ర చర్చ నడుస్తోంది. తిరుమల బుకింగ్ ప్రయత్నం ఒక చిన్న ఉదాహరణ మాత్రమే. భవిష్యత్తులో మన తరఫున నిర్ణయాలు తీసుకునే స్థాయికి ఏఐ వెళ్తే దాని నియంత్రణ బాధ్యత మనదే అవుతుంది!

## తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డుకు జాతీయ పురస్కారం

**ఆధార్ ముఖ గుర్తింపు విధానం విజయవంతంగా అమలు**

**ముద్ర, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీసు నియామక బోర్డు (టీఎస్‌ఎల్‌పీఆర్‌బీ) ప్రతిష్ఠాత్మక జాతీయ పురస్కారాన్ని అందుకుంది. పోలీసు ఉద్యోగాల నియామక ప్రక్రియలో ఆధార్ ఆధారిత ముఖ గుర్తింపు విధానాన్ని సమర్థంగా అమలు చేసినందుకు భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) 'ఆధార్ సంవాద్–2026' జాతీయ అవార్డును ప్రదానం చేసింది. కోల్‌కతాలో మంగళవారం జరిగిన 5వ జాతీయ భాగస్వాముల సదస్సులో కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతికత, వాణిజ్య–పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద సమక్షంలో టీఎస్‌ఎల్‌పీఆర్‌బీ చైర్మన్ వి.వి. శ్రీనివాసరావు ఈ పురస్కారాన్ని స్వీకరించారు. నకిలీ అభ్యర్థులకు చెక్‌పోలీసు ఉద్యోగ నియామకాల్లో ఇతరుల పేరుతో హాజరయ్యే నకిలీ అభ్యర్థులను అరికట్టేందుకు యూఐడీఏఐ హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయ మార్గదర్శకత్వంలో తొలిసారిగా ఆఫ్‌లైన్ ఆధార్ ముఖ గుర్తింపు విధానాన్ని ప్రవేశపెట్టారు. ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో ఈ సాంకేతికతను విజయవంతంగా అమలు చేసిన తొలి నియామక సంస్థగా తెలంగాణ పోలీసు నియామక బోర్డు గుర్తింపు పొందింది. ఆగస్టు 19 నుంచి సెప్టెంబర్ 16 వరకు తొలి విడత దరఖాస్తుల స్వీకరణ సమయంలో అభ్యర్థులు తమ మొబైల్ ఫోన్ల ద్వారా ఆధార్ యాప్‌ను ఉపయోగించి ముఖ గుర్తింపు ప్రక్రియను పూర్తి చేశారు. మొత్తం దరఖాస్తుదారుల్లో 98.7 శాతం మంది అంటే 4,23,348 మంది ఈ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు. మిగిలిన 5,652 మందికి యూఐడీఏఐ ప్రాంతీయ కార్యాలయ సమన్వయంతో సాంకేతిక సహాయం అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. 17వ ఆధార్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సదస్సులో ఈ అవార్డును అందజేసింది.ఈ ప్రక్రియలో కృషి చేసిన టీఎస్‌ఎల్‌పీఆర్‌బీ పాలనాధికారి ఏడ్ల రామకృష్ణ స్వామి, పర్యవేక్షకులు పిండిగ సునీల్‌కుమార్, సాంకేతిక సహాయకులు మల్లెకేడి శ్రీనాథ్‌తో పాటు సాంకేతిక భాగస్వాముల సేవలను బోర్డు అభినందించింది. వీరిని టీఎస్‌ఎల్‌పీఆర్‌బీ చైర్మన్ వి.వి. శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు.ర

# ముద్ర
సమగ్ర సమాచార పత్రిక
బుధవారం 30.09.2026
www.mudranews.in | @mudranews




### గుండెపోటు లక్షణాలు వస్తే స్పృహ కోల్పోతే అత్యవసర చర్యలు

ఫోన్‌లో అంబులెన్స్ సిబ్బంది సూచనలు పాటించాలి. వ్యక్తి స్పృహ కోల్పోయి సాధారణంగా శ్వాస తీసుకోకపోతే, CPR ప్రారంభించి AED అందుబాటులో ఉంటే దాని సూచనలను అనుసరించాలి.



## విశ్రాంత ఇంజినీర్‌కు రూ.10కోట్ల టోకరా

**విజయవాడలో భారీ మోసం..**



**ముద్ర, విజయవాడ :** విజయవాడ నగరంలో భారీ మోసం వెలుగు చూసింది. పోలీసుల పేరు చెప్పి విశ్రాంత ఇంజినీర్ కు ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లు నాలుగు విడతల్లో రూ.10 కోట్లు దోచుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. వారం రోజుల క్రితం విజయవాడ గురునానక్ కాలనీకి చెందిన ఓ విశ్రాంత ఇంజినీర్ కు అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్ కాల్ వచ్చింది. మీ ఫోన్ నంబరు వివిధ నేరాల్లో తమకు లభించిందని, మీపై కేసులు ఉన్నాయని చెప్పారు. ఆ తర్వాత వీడియోకాల్ చేసి.. డిజిటల్ అరెస్టు చేసినట్టు బెదిరించారు.కేసుల నుంచి బయటపడాలంటే భారీ గా డబ్బులు ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. దీంతో భయపడిపోయిన విశ్రాంత ఇంజినీర్ .. సైబర్ నేరగాళ్లు చెప్పినట్టు చేశారు. కృష్ణలంకలోని కెనరా బ్యాంకు ద్వారా నాలుగు లావాదేవీల్లో .. నిందితులు చెప్పిన బ్యాంకు ఖాతాల్లోకి రూ.10కోట్లు డిపాజిట్ చేశారు. ఇంకా డబ్బులు కావాలని డిమాండ్ చేయడంతో అనుమానం వచ్చిన బాధితుడు మంగళవారం సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన విజయవాడ సైబర్ క్రైమ్ పోలీసులు.. సైబర్ నేర గాళ్ల బ్యాంకు ఖాతాలను స్తంభింపజేశారు. బాధితుడు ఇచ్చిన వివరాల ఆధారంగా నిందితులకు సంబంధించిన రెండు ఖాతాల్లో ఉన్న సుమారు రూ.7కోట్లు ఫ్రీజ్ చేశారు. విశ్రాంత ఇంజినీరు బ్యాంకులో తనకున్న ఫిక్స్ డ్ డిపాజిట్ చేసిన నగదు తీసిమరీ సైబర్ నేరగాళ్లకు చెల్లించినట్టు సమాచారం.

## తమ సమస్యలు పరిష్కరించాలని సంజయ్‌కి వినతి



**ముద్ర, కరీంనగర్ :** వావిలాల ఖాదీ ప్రతిష్ఠాన్ కార్యకర్తలు, కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని కరీంనగర్‌లో ఉన్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు వినతిపత్రం అందజేశారు. మూడు నెలల వేతనాల చెల్లింపు, ఉద్యోగ విరమణ పొందిన కార్యకర్తలకు గ్రాట్యుటీ చెల్లింపు, వావిలాల ఖాదీ ప్రతిష్ఠాన్ నిర్వాహణకు చర్యలు చేపట్టాలని మంత్రికి విన్నవించారు. వావిలాల ఖాదీ ప్రతిష్ఠాన్ ఛైర్మన్ సురభి వాణి దేవితో మాట్లాడి పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు కార్మికులు తెలిపారు.

## నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు



**ముద్ర, ధర్మారం:** వ్యవసాయానికి, గృహ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ స్పష్టం చేశారు. ధర్మారం మండలం కటికనపల్లిలోని విద్యుత్ ఉప కేంద్రంలో కెపాసిటర్ బ్యాంకును ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కెపాసిటర్ బ్యాంకర్ల ద్వారా విద్యుత్ సరఫరాలో నాణ్యత మెరుగుపడుతుందన్నారు. లో వోల్టేజ్ సమస్యకు ఆస్కారం ఉండదని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈలు రాజ బ్రహ్మాచారి, శ్రీనివాస్ రెడ్డి, ఏడీఈలు వెంకటరమణ, సత్యనారాయణ, ఏఈ మునీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ

**ముద్ర, జగిత్యాల :** జగిత్యాల జిల్లాలోని ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి అనుబంధ ఆలయమైన శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. అంగారక సంకటహర చతుర్థి సందర్భంగా మన్య సూక్తంతో అభిషేకం హారతి, మంత్రపుష్పం కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో దేవస్థానం సూపరింటెండెంట్ అల్వాల శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ వావిలాల తిరుపతి, భక్తులు పాల్గొన్నారు.

## కరీంనగర్‌లో 307 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

**ముద్ర, కరీంనగర్ :** కరీంనగర్‌లోని హనుమాన్ రైస్ మిల్ ఇండస్ట్రీలో 307 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని టాస్క్ ఫోర్సు ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. పీడీఎస్ బియ్యాన్ని పాలిష్ చేసి వివిధ రకాల బ్రాండ్‌ల పేరుతో బియ్యాన్ని విక్రయిస్తూ ప్రజలను మోసం చేస్తున్న రైస్ మిల్ యజమాని కర్ణాకర్‌ను పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. టాస్క్ ఫోర్స్ ఏసీబీ అధికారి సతీష్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టి పెద్ద ఎత్తున పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి పర్యటనకు కరీంనగర్ సిద్ధం

**ముద్ర, కరీంనగర్ :** కరీంనగర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని నూతన కలెక్టర్ కార్యాలయం భవనాన్ని బుధవారం సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. జిల్లా కలెక్టర్ భవనం ప్రారంభంతో పాటు కలెక్టర్ కార్యాలయం భవన సముదాయం ముందు ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని కూడా ఆయన ఆవిష్కరించనున్నారు. దీంతో అధికారులు ప్రారంభోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీస్తున్నారు.

# విద్యార్థుల సంక్షేమంపై రాజీ పడం..

**నాణ్యమైన విద్య పౌష్టిక ఆహారాన్ని అందించడం లక్ష్యం..**
**రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి..**
**చిన్న బోనాల ఎస్టీ గురుకుల పాఠశాలను పరిశీలించిన మంత్రి లక్ష్మణ్ కుమార్..**

**ముద్ర, కరీంనగర్ :** రాష్ట్రంలోని సంక్షేమ హాస్టల్లో చదువుతున్న విద్యార్థులకు కల్పించే సౌకర్యాల విషయంలో ప్రజా ప్రభుత్వం రాజీ పడే ప్రసక్తే లేదని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలోని చిన్న బోనాల లోని ఎస్టీ సంక్షేమ హాస్టల్ ను మంత్రి లక్ష్మణ్ కుమార్ సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులతో పాటు కిచెన్ షెడ్, డైనింగ్ హాల్ తోపాటు హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ సంక్షేమ హాస్టల్లో చదువుతున్న విద్యార్థుల కు నాణ్యమైన విద్య పౌష్టిక ఆహారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొని ముందుకు సాగుతుందని తెలిపారు. ఇందులో భాగంగా విద్యార్థులకు డైట్ చార్జీలు పెంచడంతోపాటు రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థులకు



నాణ్యమైన బోధన అందించాలని మెనూ లో మార్పులు తీసుకువచ్చినట్లు మంత్రి వివరించారు.

ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుందని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. చిన్న బోనాల ఎస్టి గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న బియ్యం నాణ్యతను పరిశీలించిన మంత్రి వాటిని వెనక్కి తీసుకొని నాణ్యమైన బియ్యం పంపించాలని అధికారులను అప్పటికప్పుడు ఆదేశించారు.



అదేవిధంగా చిన్న బోనాల గురుకుల పాఠశాలకు కావలసిన మౌలిక సదుపాయాలకు అంచనాలు తయారు చేసి అందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

# జిల్లా ప్రజల ఏళ్ల నిరీక్షణకు తెర..

**నేడు సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నేడు కొత్త కరీంనగర్ కలెక్టరేట్ ప్రారంభం**

**ముద్ర, కరీంనగర్ :** జిల్లా ప్రజల ఏళ్ల నిరీక్షణకు తెరపడనుంది. ప్రభుత్వ సేవలను ఒకే చోట అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో అత్యాధునిక హంగులతో నిర్మించిన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) ప్రారంభానికి సిద్ధమైంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు నూతన పరిపాలనా సౌధాన్ని ప్రారంభించనున్నారు. పాత కలెక్టరేట్‌కు సమీపంలో ఉత్తర ముఖద్వారంతో 26.5 ఎకరాల విస్తీర్ణంలో ఈ భవన సముదాయాన్ని నిర్మించారు. సుమారు 1.59 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ.51 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణం చేపట్టినట్లు ఆర్అండ్‌బీ అధికారులు తెలిపారు.

**భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా..**

2021లో ప్రారంభమైన నిర్మాణ పనులను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా జీ+2 అంతస్తులుగా చేపట్టారు. మంత్రులు, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల కోసం ప్రత్యేక స్టేట్ ఛాంబర్, కలెక్టర్ ఛాంబర్‌తోపాటు ఇద్దరు అదనపు కలెక్టర్లకు ప్రత్యేక ఛాంబర్లను ఏర్పాటు చేశారు. ప్రజల కోసం రెండు వెయిటింగ్ హాళ్లు సిద్ధం చేశారు. ఒకేసారి 250 మంది కూర్చునేలా దిగువ అంతస్తులో భారీ సమావేశ మందిరంతోపాటు చిన్న సమావేశ మందిరాన్ని నిర్మించారు. ప్రతి అంతస్తులో ప్రత్యేక కాన్ఫరెన్స్ హాల్ ఏర్పాటు చేశారు. వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బంది విధులు నిర్వహించేందుకు 10, 20, 30 మంది సామర్థ్యంతో సుమారు 34 భారీ హాళ్లను అందుబాటులోకి తీసుకొచ్చారు.

**ఉద్యోగులు, ప్రజలకు సకల వసతులు**

ఉద్యోగినుల పిల్లల కోసం ప్రత్యేక శిశు సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. భవనంలో లిఫ్టులు, విశాలమైన కారిడార్లతోపాటు దివ్యాంగులకు అనుకూలంగా ప్రతి అంతస్తులో బారియర్ ఫ్రీ డిజైన్‌తో శౌచాలయాలు నిర్మించారు. అత్యవసర పరిస్థితులు, అధికారిక పర్యటనల సందర్భంగా వినియోగించుకు నేందుకు ప్రాంగణంలోనే ప్రత్యేక హెలిప్యాడ్‌ను కూడా సిద్ధం



చేశారు.

**అన్ని కార్యాలయాలు ఒకేచోటికి వస్తాయా?**

ప్రస్తుతం పలు ప్రభుత్వ శాఖల కార్యాలయాలు జిల్లా కేంద్రంలోని వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్నాయి. జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో), పంచాయతీరాజ్ కార్యాలయాలు అంబేద్కర్ స్టేడియంలో ఉండగా.. గనులు, చేనేత, కార్మిక శాఖ కార్యాలయాలు మంకమ్మతోటలో కొనసాగుతున్నాయి. తూనికలు, కొలతల కార్యాలయం తిమ్మాపూర్‌లో, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయం అంబేద్కర్ స్టేడియం సమీపంలో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల కార్యాలయాలు కూడా వేర్వేరు ప్రాంతాల్లో ఉన్నాయి.

ఈ కార్యాలయాలన్నింటినీ కొత్త సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోకి తీసుకొస్తే ప్రజలకు ఎంతో ప్రయోజనం కలగనుంది. వివిధ పనుల కోసం



కిలోమీటర్ల మేర తిరగాల్సిన అవసరం లేకుండా ఒకే ప్రాంగణంలో ప్రభుత్వ సేవలు పొందే అవకాశం ఉంటుంది. అయితే ప్రస్తుతం ఏయే కార్యాలయాలను కొత్త సముదాయంలోకి తరలించాలి, ఏ కార్యాలయాలను యథావిధిగా కొనసాగించాలనే అంశంపై తుది నిర్ణయం తీసుకోలేదు. భవన ప్రారంభం అనంతరం దీనిపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు.

# తెలంగాణలో పెట్టుబడి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

**తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి**

**ముద్ర, హైదరాబాద్ :** జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌లో భారత కాన్సులేట్ జనరల్ కార్యాలయంలో తెలంగాణలో పెట్టుబడి అవకాశాలు, తెలుగు ప్రవాసులతో అనుసంధానం అంశాలపై సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి , శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ , శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్ బండ ప్రకాష్ , తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత కాన్సులేట్ ప్రతినిధులు గుత్తా సుఖేందర్ రెడ్డి, గడ్డం ప్రసాద్ కుమార్ , బండ ప్రకాష్ గార్లను శాలువాతో సత్కరించి ఘనంగా స్వాగతించారు. సమావేశంలో తెలంగాణలో అందుబాటులో ఉన్న పెట్టుబడి అవకాశాలు, పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, ఇన్నోవేషన్, టెక్నాలజీ రంగాల్లో ఉన్న అవకాశాలపై చర్చించారు.

ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ, "తెలంగాణ రాష్ట్రం పెట్టుబడులకు అనుకూలమైన ప్రాంతంగా అభివృద్ధి చెందిందని, హైదరాబాద్ నగరం ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఇన్నోవేషన్ తదితర రంగాల్లో ప్రత్యేక గుర్తింపు సాధించిందన్నారు . విదేశాల్లో స్థిరపడిన తెలుగు ప్రజలు తమ మాతృభూమితో అనుబంధాన్ని కొనసాగిస్తూ, రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలి" అని పేర్కొన్నారు.




జర్మనీతో పాటు యూరప్‌లోని పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు తెలంగాణలో ఉన్న అవకాశాలను పరిశీలించాలని ఆయన కోరారు. ప్రవాస తెలంగాణ వాసులు రాష్ట్రానికి పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాలను తీసుకు రావడంలో వారధిగా నిలవాలని సూచిం చారు. "ప్రపంచంలోని వివిధ దేశాల్లో తెలుగు వారు తమ ప్రతిభతో ఉన్నత స్థానాలకు చేరుకోవడం గర్వకారణమని, వారు జన్మభూమి అభివృద్ధికి తమవంతు సహకారం అందించాలని గుత్తా సుఖేందర్ రెడ్డి పేర్కొన్నారు.



ఈ కార్యక్రమంలో తెలంగాణ శాసన మండలి సెక్రెటరీ డా. నరసింహాచార్యులు , అసెంబ్లీ సెక్రెటరీ ఆర్ . తిరుపతి , లేజిస్లేచర్ ప్రతినిధి బృందం సభ్యులు, భారత కాన్సులేట్ అధికారులు, తెలుగు ప్రవాసులు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
బుధవారం 30.09.2026
www.mudranews.in | @mudranews



## వైద్యుల సూచన లేకుండా మందులు వద్దు

ఇతరులు వాడే గుండె మందులు లేదా నొప్పి నివారణ మందులను సొంతంగా తీసుకోకూడదు. అయితే గతంలో వైద్యుడు ప్రత్యేకంగా సూచించిన అత్యవసర మందులు ఉంటే, ఆయన చెప్పిన విధంగానే ఉపయోగించాలి.



## అంగరంగ వైభవంగా కళ్యాణోత్సవం

అలంకార ప్రియుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి మంగళవారం మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య సుగంధ భరితమైన పుష్పమాలలతో తోమాల సేవను నయన మనోహరంగా అర్చక స్వాములు నిర్వహించారు. నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు శ్రీ స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి ఆనంద పరవశులైనారు.

- ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి



# ధాన్యం కొనుగోలు ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలి

**జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి**

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ఖరీఫ్ సీజన్ లో వరి ధాన్యం కొనుగోలు పకడ్బందీగా, ప్రణాళిక ప్రకారం ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో 2026–2027, ఖరీఫ్ సీజన్లో ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల ఏర్పాటు నిర్వహణ కోసం రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి, సివిల్ సప్లై అధికారులు, వ్యవసాయ,సంబంధిత అధికారులతో వరి కొనుగోలు సన్నాహక శిక్షణ తరగతుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అధికారుల అంచనా మేరకు దాదాపు 3,00,000 మెట్రిక్ టన్నుల సన్న, దొడ్డు రకం ధాన్యం కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు.రానున్న ఖరీఫ్ సీజన్లో ముందస్తు ప్రణాళిక ప్రకారం జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల ఏర్పాటు నిర్వహణ సంబంధిత అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో కలిసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. పి సి ఎస్ ఏ పి యాప్ నందు 16 ప్రశ్నలకి సమాధానం లు ఇచ్చిన తర్వాత మాత్రమే ఒపీఎంఎస్ టాబ్ లకు పర్మిషన్ ఇవ్వబడుతుంది.




15/10/2026 లోపు పూర్తి చేయగలరు. రైతులందరూ టార్పాలిన్ కవర్లు ఎక్కువగా ఉంచుకోవాలన్నారు. మహిళా సంఘాల ద్వారా కొనుగోలు సెంటర్ ను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు .ఐకెపి, సమ భావన సంఘాల సభ్యులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలు, తదితర సంస్థల ద్వారా సుమారు (325) కేంద్రాల ఏర్పాటు చేయడం జరుగుతుందనీ, మరియు 7 రకాల సన్న ధాన్యం కొనుగోలు చేయాలని, సన్న వడ్ల కు క్వింటాకు 500/- బోనస్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అందుకోసం జిల్లా స్థాయి దాన్యం కొనుగోళ్ల కేంద్రాల కమిటీ ద్వారా ప్రభుత్వం సూచించిన ప్రకారం ముందుకు వెళ్లడం జరుగుతుందన్నారు,ధాన్యం సేకరణ వివరాలను వ్యవసాయ శాఖ ద్వార స్వీకరించి కేంద్రాలకు వచ్చే దాన్యం పూర్తి వివరాలు డాటా ఎంట్రీ లో పొందుపరచాలన్నారు. కొనుగోలు రవాణా, డ్రై మిషన్,ప్యాడి క్లీనర్స్, వేయింగ్ మిషన్స్, మ్యాచ్చర్స్, ఆటోమేటిక్ జాలి మిషన్లు, ముందస్తుగా సిద్ధంగాఉంచుకోవాలన్నారు.కేంద్రాలలో గన్ని సంచులు, అవసరానికి అనుగుణంగా ముందస్తుగా సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు సెంటర్లో కనీస వసతులైన మంచినీరు, అందుబాటులో ఉండేలాచూసుకోవాలన్నారు రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు.ప్యాడి సెంటర్లను శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ట్యాబ్ ఎంట్రీ ప్రతిరోజు చేయాలన్నారు.కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే రైస్ మిల్లులకు పంపే విధంగా ప్రణాళిక ప్రకారం లారీలను, హమాలీలను సిద్ధంగా ఉంచుకునేలా చర్యలు తీసుకోవాలని, కొనుగోళ్లకు సంబంధించి దాన్యం డబ్బుల ను రైతుల ఖాతాలలో వెంటనే జమ అయ్యేందుకు చర్యలు తీసుకోవాలని, కేంద్రాలలో నిబంధనల ప్రకారం అన్ని సౌకర్యాలు కల్పించడం కోసం ఆన్ని శాఖల సమన్వయంతో ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని ఆయన ఆదేశించారు.వరి ధాన్యం క్వింటాలకి ఏ గ్రేడ్ కు రూ.2461/-, సాధారణ రకం క్వింటాలకి 2441/- చొప్పున ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందని అన్నారు.ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ హరికృష్ణ, డిఏఓ రమణ రెడ్డి, సివిల్ సప్లై రోజారాణి, డి సి ఓ మురళి, లీగల్ మెట్రోలాజి అడిషనల్ డి ఆర్ డి ఎ పాల్గొన్నారు.

## సహకార సంఘాల బలోపేతానికి కృషి చేయాలి



**రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం.. భువనగిరి పీఏసీఎస్ సర్వసభ సమావేశంలో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి**

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** రైతులకు మరింత మెరుగైన సేవలు అందించడంతో పాటు సహకార సంఘాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేయాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. భువనగిరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. సహకార రంగం ద్వారా రైతులకు అవసరమైన సేవలు సకాలంలో అందేలా అధికా రులు, పాలకవర్గం సమన్వయంతో పనిచేయాలన్నారు. రైతుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఫకీర్ కొండల్‌రెడ్డి, వైస్ చైర్మన్ వీరస్వామి, డైరెక్టర్లు ఉదరి పాపమ్మ శంకరయ్య,ఆంజనేలు, దాసరి శ్రీశైలం,తుమేటి వేంకటేష్, ఎడ్ల సత్తిరెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## జనాభా లెక్కలలో 21 రకాల వైకల్యాలను గుర్తించాలి




**ఎన్ పి ఆర్ డి ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా**

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** వికలాంగుల హక్కుల జాతీయ వేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి ఆ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు స్వరూపంగా ప్రకాష్, వనం ఉపేందర్ మాట్లాడుతూ త్వరలో జరగబోయే జనాభా లెక్కల యందు 21 రకాల వైకల్యాలను గుర్తించకుండా కేవలం తొమ్మిది రకాల వైకల్యాలు గుర్తించడం వికలాంగులను మోసం చేయడమేనన్నారు. జిల్లా ఏర్పడి తొమ్మిది సంవత్సరాలు గడుస్తున్న ఒక్క బ్యాక్లాగ్ పోస్టు కూడా నింపకపోవడం వికలాంగుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి బయటపడుతుందన్నారు. ప్రభుత్వం స్పందించి వికలాంగుల బ్యాక్లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లేపల్లి స్వామి, జిల్లా కోశాధికారి కొత్త లలిత, జిల్లా నాయకులు మధిర పద్మ, శ్యాంసుందర్, వెంకటేష్, గోపి, నాగు, నరసింహ, రేణుక, హరిబాబు, గిరి పాల్గొన్నారు.

## ఐకేఎంఎస్ 4వ జాతీయ మహాసభలు ప్రారంభం



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబరు 29 :** రైతు, కూలీల హక్కులు, ఉద్యమాల దిశానిర్దేశం లక్ష్యంగా అఖిల భారత రైతు కూలీ సంఘం 4వ జాతీయ మహాసభలు ఖమ్మంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. పోరాట నినాదాలు, అమరవీరుల స్మరణ మరియు విప్లవ గేయాల మధ్య జాతీయ అధ్యక్షుడు వేములపల్లి వెంకట్రామయ్య జెండాను ఆవిష్కరించి సభను ప్రారంభించారు. మహాసభలో ఆహ్వాన సంఘం అధ్యక్షులు డాక్టర్ ఎం.ఎఫ్. గోపీనాథ్ ప్రసంగిస్తూ దేశంలో రైతులు, వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న దోపిడికి వ్యతిరేకంగా ఐక్య పోరాటాలు నిర్మించాలని పిలుపు నిచ్చారు.ఈ మహాసభలకు వివిధ రాష్ట్రాల ప్రజా, ఆదివాసీ, మహిళా, విద్యార్థి సంఘాల నాయకులు హాజరై అభినందనలు తెలిపారు. కార్పొరేట్ దోపిడీ, భూస్వామ్య ఆధిపత్యం, కుల వివక్షకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలను విస్తృతం చేయాల్సిన అవసరాన్ని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ అసిస్ మిట్టల్, ఉపాధ్యక్షులు సుశాంత్ ఝా, జే.వి. చలపతి రావు పలువురు ప్రముఖ నాయకులు, విప్లవ శ్రేణులు పాల్గొన్నారు.

# రోస్టర్ రిజిస్టర్ల పరిశీలన



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** దివ్యాంగులకు ప్రభుత్వ ఉద్యోగాలలో లభించాల్సిన రిజర్వేషన్ అవకాశాలను సమర్ధవంతంగా అమలు చేయడం కోసం ప్రభుత్వం చేపట్టిన స్పెషల్ రిక్రూట్మెంట్ డ్రైవ్ లో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన రోస్టర్ రిజిస్టర్లను జిల్లా స్థాయి కమిటీ ఆధ్వర్యంలో పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ శాఖల రోస్టర్ రిజిస్టర్లు, దివ్యాంగులకు కేటాయించిన బ్యాక్ లాగ్ ఖాళీలు, సంబంధిత రిజర్వేషన్ వివరాలను కమిటీ సభ్యులు పరిశీలించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా దివ్యాంగులకు కేటాయించిన ఖాళీలను గుర్తించి, ప్రత్యేక నియామక డ్రైవ్ ద్వారా భర్తీ చేయడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ పరిశీలన కార్యక్రమంలో జిల్లా స్థాయి కమిటీ సభ్యులైన జిల్లా సంక్షేమ, మహిళ శిశు వికలాంగుల, వయో వృద్ధుల సంక్షేమ శాఖ అధికారి సి హెచ్ శ్రీనివాస్, జిల్లా ఉపాధి అధికారి, పద్మ, కలెక్టరేట్ పరిపాలన అధికారి, తెలంగాణ విలాంగుల హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షులు కనకబోయిన నాగరాజ్, రాజపేట మండల అధ్యక్షులు ఇప్పల రమేష్, ఎన్ జి ఓ మధుసూదన్ రెడ్డి, శివ పాల్గొన్నారు.

## రైతు-కూలీల భాగస్వామ్యంతోనే నిజమైన విముక్తి

**ప్రొఫెసర్ మనోరంజన్ మహంతి**




**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబరు 29 :** అధికారంలో రైతు, కూలీలకు భాగస్వామ్యం లభించినప్పుడే వారి విముక్తికి సార్థకత చేకూరుతుందని, ఆ దిశగా వ్యూహాలు రచించుకోవాలని సామాజిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ మనోరంజన్ మహంతి పిలుపునిచ్చారు. ఖమ్మంలోని పిఎస్ఆర్ ఫంక్షన్ హాలులో ప్రారంభమైన అఖిల భారత కిసాన్ మజ్దూర్ సభ 4వ జాతీయ మహాసభల్లో ప్రారంభోపన్యాసం చేశారు. దేశంలో ఉత్పత్తికి ఆధారమైన రైతులు, కూలీల అవసరాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా అలక్ష్యం చేస్తున్నాయని ప్రొ. మహంతి ఆవేదన వ్యక్తం చేశారు. సంపద సృష్టిస్తున్న శ్రామికవర్గం ఆకలి, పేదరికం, సామాజిక అణచివేతకు గురవుతోందని పేర్కొన్నారు. ఉత్పాదక ఆస్తులపై హక్కులు సాధించడం, నిర్ణయాధికారాల్లో భాగస్వామ్యం పొందడమే రైతు, కూలీల సమస్యలకు అంతిమ పరిష్కారమని స్పష్టం చేశారు. ఆత్మనిర్భర్ భారత్ పేరుతో అడవులు, గనులు, భూములను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారని కేంద్ర ప్రభుత్వంపై ఆయన ధ్వజమెత్తారు.సంస్థ జాతీయ అధ్యక్షుడు వేములపల్లి వెంకటరామయ్య అధ్యక్షతన జరిగిన ఈ సభలో డాక్టర్ ఎం.ఎఫ్. గోపీనాథ్, టి. వేణు ప్రతినిధులకు స్వాగతం పలికారు. ఈ మహాసభలో తమిళనాడు, ఒడిశా, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల రైతు సంఘాల నాయకులు కార్పొరేట్ దోపిడీకి వ్యతిరేకంగా మాట్లాడారు. ప్రణాళికాబద్ధమైన పోరాటాలతోనే శ్రామికవర్గాల హక్కులు సాధ్యమవుతాయని నాయకులు ఉద్ఘాటించారు. అంతకుముందు అరుణోదయ కళాకారుల 'ఆజాదీ' నృత్యం, సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను ఆకట్టుకున్నాయి. ఈ మహాసభల్లో 16 రాష్ట్రాల నుంచి వచ్చిన 450 మంది ప్రతినిధులు రాబోయే రెండు రోజులు భవిష్యత్ ఉద్యమ కార్యాచరణపై చర్చించనున్నారు.

## ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ కార్యాచరణ

**354 కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి సన్నాహాలు..**

**రైతులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు: కలెక్టర్**

**ముద్ర, సూర్యాపేట:** ఖరీఫ్ 2026–27 సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లను రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో 354 ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి అవసరమైన మౌలిక వసతులు, రవాణా, నిల్వ ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు.కలెక్టరేట్‌లో సోమవారం అధికారులతో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ పలు సూచనలు చేశారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం యంత్రాలు, తేమ కొలిచే పరికరాలు, ప్యాడీ క్లీనర్లు, గన్నీ సంచులు, హమాలీలు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వర్షాలకు ధాన్యం తడవకుండా రైతులకు టార్పాలిన్లు సకాలంలో అందించాలని తెలిపారు.FAQ ప్రమాణాల ప్రకారం ధాన్యం కొనుగోలు చేయడంతో పాటు టోకెన్ల జారీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎలాంటి జాప్యం లేకుండా గోదాములకు తరలించాలని, అవసరమైన వాహనాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని తెలిపారు. వాహనాల కదలికను GPS ద్వారా పర్యవేక్షించాలని ఆదేశించారు.కొనుగోళ్ల వివరాలను OPMSలో ఎప్పటికప్పుడు నమోదు చేసి రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం అర్హత కలిగిన సన్న/ఫైన్ వెరైటీ ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొనుగోళ్లు, రవాణా, గోదాం నిల్వ, OPMS ప్రక్రియలను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.

గ్రీన్ ఫీల్డ్ హైవేపై బస్సు–లారీ ఢీ: పలువురికి గాయాలుముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబరు 29 : సోమవరం వద్ద గ్రీన్ ఫీల్డ్ హైవే ఎగ్జిట్ సమీపంలో ప్రమాదం జరిగింది. దేవరపల్లి నుంచి ఖమ్మం వైపు వస్తున్న ఒక ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ముందు వెళ్తున్న లారీని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సు క్యాబిన్ తీవ్రంగా ధ్వంసమై డ్రైవర్ అందులోనే ఇరుక్కుపోగా, బస్సులోని పలువురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని డ్రైవర్‌ను సురక్షితంగా బయటకు తీశారు. గాయపడిన వారందరినీ చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## బాలికల హాస్టల్ ను సందర్శించిన ఎంపీడీవో



**ముద్ర, వలిగొండ:** మండలంలోని లొతుకుంటలో బాలికల హాస్టల్‌ను మంగళవారం ఎంపీడీవో జి. జలంధర్ రెడ్డి సందర్శించి హాస్టల్‌లోని పరిసరాలను, విద్యార్థుల హాజరు రిజిస్టర్‌ను, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. హాస్టల్‌లో నిర్వహిస్తున్న సరుకుల నాణ్యత, పరిమాణాన్ని స్వయంగా తనిఖీ చేశారు.అనంతరం విద్యార్థులతోఫుడ్ కమిటీ సభ్యులతో మాట్లాడి హాస్టల్‌లో వారికి ఎదురవుతున్న సమస్యలు, ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, భోజన నాణ్యతపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అలాగే ఆదివారం రోజు కూడా తప్పనిసరిగా స్టాఫ్ అందుబాటులో ఉండాలి అని సూచించారు.మధ్యాహ్న భోజన సమయంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. జలంధర్ రెడ్డి విద్యార్థులతో కలిసి గ్రామ సర్పంచ్ రాములు విద్యార్థులకు భోజనం వడ్డించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి, వారికి అందుతున్న ఆహారం నాణ్యతను స్వయంగా పరిశీలించారు.విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు, నాణ్యమైన ఆహారం అందేలా సంబంధిత సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలని ఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి సూచించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి క్రాంతి హాస్టల్ స్టాఫ్ పాల్గొన్నారు.

## అక్టోబర్ 1న ఖమ్మంలో జాబ్ మేళా

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబరు 29 :** ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు అక్టోబరు 1 న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారిణి ఎన్. మాధవి తెలిపారు. ఖమ్మం టీటీడీసీ ప్రాంగణంలో ఈ ఎంపికలు జరుగుతాయి. ఫ్లిప్‌కార్ట్ సంస్థలో 20 ఫీల్/డెలివరీ ఎగ్జిక్యూటివ్ పోస్టులను భర్తీ చేయనున్నారు. పదో తరగతి లేదా ఆపై చదివి, 18 నుంచి 40 ఏళ్ల వయస్సు ఉండి, ద్విచక్ర వాహనం కలిగిన పురుషులు, మహిళలు ఈ పోస్టులకు అర్హులు. ఎంపికైన వారికి నెలకు 17 వేల వేతనంతో పాటు ఇన్సెంటివ్‌లు ఉంటాయి. ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యా అర్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో గురువారం ఉదయం 10 గంటలకు టీటీడీసీ వద్ద జరిగే జాబ్ మేళాకు నేరుగా హాజరుకావాలని ఉపాధి అధికారిణి కోరారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
బుధవారం 30.09.2026
www.mudranews.in | @mudranews



### గుండెపోటు లక్షణాలు వస్తే

వెంటనే 112కు కాల్ చేయండి
ఛాతిలో నొప్పి/బిగుతు, శ్వాస తీసు కోవడంలో ఇబ్బంది, చెమటలు, వికారం వంటి లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా 112కు ఫోన్ చేసి అంబులెన్స్ కోరాలి. స్వయంగా వాహనం నడుపుకుంటూ ఆస్పత్రికి వెళ్లకూడదు.




# ధాన్యం కొనుగోళ్లకు సంసిద్ధం కావాలి

**జిల్లాలో 518 కేంద్రాలు**
**కలెక్టర్ ప్రతిమాసింగ్**




**ముద్ర ప్రతినిధి, మెదక్:**ఖరీఫ్ (వానాకాలం) సీజన్ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లతో సంసిద్ధంగా ఉండాలని కలెక్టర్ ప్రతిమాసింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లో వానాకాలం సీజన్ ధాన్యం కొనుగోళ్ల ఏర్పాట్లపై వ్యవసాయ, పౌరసరఫరాల శాఖ, సహకార శాఖ, మార్కెటింగ్, డీఆర్డీఓ, రవాణా, పోలీస్ శాఖల అధికారులతో ఇంచార్జ్ అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్ తో కలిసి కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళికాబద్ధంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు, రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా కొనుగోలు కేంద్రాలను సంసిద్ధంగా తయారు చేసినట్లు చెప్పారు. ఈసారి జిల్లాలో 3 లక్షల 20వేల ఎకరాలలో రైతులు వరి సాగు చేసినట్లు అంచనా వేసినట్లు వివరించారు. దొడ్డు రకం – 413, సన్న రకం–105 కేంద్రాలు, మొత్తం 518 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు గ్రేడ్ – ఏ ధాన్యానికి– 2461, సాధారణ రకం–2441 ధర నిర్ణయించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఐకేపీ 174, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం–300, సహకార మార్కెటింగ్ సొసైటీ –12 , ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్– రైతు ఉత్పత్తి దారుల సంస్థ ఆధ్వర్యంలో –32 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ సమీక్ష సమావేశంలో సివిల్ సప్లై మేనేజర్ జగదీష్, జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, డిఆర్డిఓ శ్రీనివాసరావు, సహకార శాఖ అధికారి పద్మ, లీగల్ మెట్రాలజీ అధికారి సుధాకర్, రవాణా శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.పరిశ్రమలలోనే ఉపాధి అవకాశాలుజిల్లాలో చదువుకున్న యువతకు స్థానికంగా ఉన్న పరిశ్రమలలోనే ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా మెసిక్ పోర్టల్ ద్వారా పటిష్ట ప్రణాళికలు రూపొందించినట్లు కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. జిల్లా నైపుణ్య అభివృద్ధి కార్యాచరణ ప్రణాళికల కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ... మెదక్ జిల్లాలో చదువుకున్న యువతకు వారు ఎంచుకున్న రంగంలో స్థానిక పరిశ్రమలలో ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా పటిష్ట ప్రణాళికద్వారా ముందుకు పోతున్నామన్నారు. మెదక్ జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు మరియు నైపుణ్యం గల యువత యొక్క సమగ్ర డేటాబేస్‌ను రూపొందించాలన్నారు. నిరుద్యోగ యువత వారు కోరుకుంటున్న రంగంలో దానికి అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించి, వారికి ఉపాధి అవకాశాలను కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కల్పన అధికారి రామరాజు, పరిశ్రమల అధికారి యాదయ్య, ఐటిఐ ప్రిన్సిపల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు

**అన్ని వర్గాలకు న్యాయం ఎమ్మెల్యే డా.రోహిత్**



**ముద్ర ప్రతినిధి, మెదక్:** అర్హులైన ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ అన్నారు. మెదక్ పట్టణంలో అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్ల పట్టాలు పంపిణి చేశారు. రోహిత్ మాట్లాడుతూ..పదేళ్లలో బిఆర్ఎస్ సర్కార్ ఒక్క ఇల్లు ఇవ్వలేదు. ఇచ్చిన ఐదు, పది ఇళ్లు కూడా డబ్బులు తీసుకొని ఇచ్చారు.ఇందిరమ్మ రాజ్యంలో ఇళ్లు ఇస్తున్నాన్నారు. సన్నబియ్యం, కరెంట్, బస్సు ఫ్రీ ఇస్తున్నామని పేర్కొన్నారు. బిఆర్ఎస్ పాలనలో అవినీతి జరిగిందని కెసిఆర్ కూతురే చెబుతున్నారన్నారు. అందరికి న్యాయంగా ఇవ్వాలన్నదే మా ప్రభుత్వ సంకల్పం. ఆశపెట్టి, మభ్యపెట్టి పదేళ్లు గడిపింద్రు, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండున్నర ఏళ్ళు అవుతుంది, రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి దివాళా తీయించారన్నారు. దళిత బందు ఎంతమందికి ఇచ్చారు. రోజు ప్రజల మధ్యలో ఉంటున్నాం. ప్రజలు తమ బాధ చెప్పుకుంటున్నారు. ఏ గ్రామం వెళ్లిన ఇందిరమ్మ ఇల్లే కనిపిస్తున్నాయి. డబ్బులు ఎవ్వరికి ఇవ్వొద్దు.. న్యాయంగా ఇళ్ళు ఇచ్చేలా తాము పనిచేస్తామన్నారు. గత ప్రభుత్వ తప్పిదాలను తమ మీద వేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రమాదేవి, మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక భూపతిరాజ్, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, హౌసింగ్ పీడీ మాణిక్యం, మున్సిపల్ కమీషనర్ నవీన్, తహసీల్దార్ లక్ష్మణ్ బాబు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గంగాధర్, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## అథ్లెటిక్స్‌లో రాణించి మెదక్‌కు పేరు తేవాలి

**మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక**



**ముద్ర ప్రతినిధి, మెదక్:**గెలుపోటములు సహజం.. ఓటమిని గెలుపునకు పునాదిగా మలుచుకోవాలిజాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటి మెదక్ కు పేరు తేవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక భూపతిరాజు పిలుపునిచ్చారు. మెదక్ పట్టణంలోని ఔట్ డోర్ స్టేడియంలో జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 20వ జాతీయ అంతర్ జిల్లా జూనియర్ అథ్లెటిక్స్ మీట్ పోటీలను ప్రారంభించిన అనంతరం విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లను అందజేశారు. రాధిక మాట్లాడుతూ... మెదక్‌లో అథ్లెటిక్ స్టేడియంతో పాటు ఇండోర్ స్టేడియం ఉండటం క్రీడాకారులకు ఎంతో ప్రయోజనకరమన్నారు. స్టేడియాలను సంరక్షించుకుంటూ క్రీడల్లో రాణించాలని సూచించారు. గతంలో మెదక్ ప్రాంతానికి చెందిన పలువురు క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించారని గుర్తుచేశారు. క్రీడాకారులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు.జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి రమేష్, జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి అనుముల మధుసూదన్, వ్యాయామ ఉపాధ్యాయులు రాజేందర్, సుజాతకుమారి, క్రీడాకారులు పాల్గొన్నారు.

# నాతో పెట్టుకోవద్దు..

**ఆధారాలతోనే మాట్లాడుతున్నా**
**బీఆర్ఎస్ అధినేత నిర్ణయాన్ని వ్యతిరేకించడం పార్టీ వ్యతిరేక చర్య కాదా?**
**కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఘాటుగా స్పందన**
**తెలంగాణ రక్షణ సేన చీఫ్ కవిత**



**ముద్ర, హైదరాబాద్:** తాను ఏ విషయమైనా నిర్దిష్టమైన ఆధారాలతోనే మాట్లాడుతానని, తనతో పెట్టుకోవద్దని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు ‘ఎక్స్’ వేదికగా ఆమె ఘాటుగా స్పందించారు.బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలతోనే పార్టీ ఓడిపోయిందంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను కవిత తప్పుబట్టారు. తాను పార్టీలోని ఓ నేతను విమర్శించినందుకే కొన్ని గంటల్లో తనను సస్పెండ్ చేశారని, అదే నేతతో కలిసి ఉంటూ పార్టీ అధినేత నిర్ణయాలను బహిరంగంగా ప్రశ్నించడం పార్టీ వ్యతిరేక చర్య కాదా అని నిలదీశారు.అధికారాన్ని అడ్డుపెట్టుకుని సంపాదించుకున్న ఫామ్‌హౌస్‌లు, అక్రమంగా ఇచ్చిన అనుమతులు, ఇతర వ్యవహారాలు, క్విడ్‌ప్రోకో దందాలతో బీఆర్ఎస్‌ను పాతాళంలోకి నెట్టింది మీరే అంటూ కేటీఆర్‌పై కవిత ఆరోపణలు చేశారు. పార్టీలో జరిగిన వైఫల్యాలను కేసీఆర్‌పై మోపడం సరికాదన్నారు.ఇటీవల జరిగిన బీఆర్ఎస్ సమావేశంలో ఓ రైతుతో మాట్లాడిన తీరు, గతంలో సాయం కోసం వచ్చిన మహిళ పట్ల చేసిన వ్యాఖ్యలను కూడా కవిత ప్రస్తావించారు. పార్టీ అధినేతను తప్పుపట్టే ముందు తమ వైఫల్యాలను సమీక్షించుకోవాలని సూచించారు.తాను ఎవరూ చెప్పిన మాటలు విని మాట్లాడనని, నిర్దిష్టమైన ఆధారాలతోనే మాట్లాడుతున్నానని కవిత స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీకి నష్టం కలిగించే విధంగా వ్యవహరించవద్దని కేటీఆర్‌ను హెచ్చరించారు.

## దేవుళ్లను విభజించి రాజకీయాలా..

**ఇదేం నీచమైన సంస్కృతి?**



**ముద్ర, హైదరాబాద్:** దేవుళ్లను కూడా విభజించి రాజకీయాలు చేయడం కాంగ్రెస్ పార్టీ సంస్కృతిగా మారిందని బీజేపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ జూటూరు కీర్తిరెడ్డి విమర్శించారు. ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి శివుడు పేదల దేవుడు, శ్రీరాముడు సంపన్నుల దేవుడంటూ చేసిన వ్యాఖ్యలను ఆమె తీవ్రంగా ఖండించారు.కులం, మతం, ప్రాంతాల పేరుతో విభజించే రాజకీయాలకు తోడు ఇప్పుడు దేవుళ్లను కూడా వర్గాలుగా విభజించే పరిస్థితి వచ్చిందని కీర్తిరెడ్డి ఆరోపించారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి మాట్లాడే మాటలు ఇవేనా అని ప్రశ్నించారు. ఇలాంటి వ్యాఖ్యలతో తెలంగాణ ప్రతిష్టకు భంగం కలుగుతుందని అన్నారు.దేవుడు లోకకల్యాణాన్ని కోరేవాడే తప్ప పేదలకు ఒక దేవుడు, సంపన్నులకు మరో దేవుడు అంటూ విభజించడం సరికాదని పేర్కొన్నారు. ప్రజాదరణ తగ్గిన ప్రతిసారీ కాంగ్రెస్ నేతలు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తుంటారని విమర్శించారు.గతంలో కాంగ్రెస్‌లోని ఓ నేత దేవాదాయశాఖ మంత్రిగా ఉండి ‘జై శ్రీరామ్ అంటే పైసలు వస్తాయా?’ అంటూ వ్యాఖ్యలు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా కీర్తిరెడ్డి గుర్తుచేశారు. ఇప్పుడు ముఖ్యమంత్రి సైతం దేవుళ్లను పేదలు, సంపన్నులుగా విభజిస్తూ మాట్లాడటం తగదన్నారు.రాముడిని ఒక పార్టీకి, శివుడిని మరో వర్గానికి ఆపాదించడం సరికాదని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్లను రాజకీయ మైక్రోఫోన్‌గా మార్చడం కాకుండా, ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, సమస్యల పరిష్కారం, పాలనపై దృష్టి సారించాలని కీర్తిరెడ్డి సూచించారు.

## ప్రజాభిప్రాయాన్ని తారుమారు చేస్తున్న బీజేపీ

**డీసీసీ ప్రధాన కార్యదర్శి జూకంటి రాజాగౌడ్**




**ముద్ర ప్రతినిధి, మెదక్:**బీజేపి మూడు సార్లు ఓట్లు దొంగలించిఅధికారంలోకి వచ్చింది తప్ప ప్రజల మద్దతుతో కాదని డీసీసీ ప్రధాన కార్యదర్శి జూకంటి రాజాగౌడ్ అన్నారు. ఎస్ఐఆర్ లో జరిగిన అవకతవకలతో అది బయటపడిందన్నారు. స్వతంత్ర ప్రతిపత్తి కలిన సంస్థ కేంద్ర ఎలక్షన్ కమీషన్ ని బీజేపి పార్టీకి అనుకూలంగా వాడుకుని ప్రజాస్వామ్యాన్ని ఖూని చేసి, 2సార్లు అధికారంలోకి వచ్చారన్నది జ్ఞానేష్ కుమార్ చర్యల ద్వారా దేశప్రజలందరికి స్పష్టంగా తెలిసివచ్చిందని రాజాగౌడ్ తెలిపారు. సర్ ప్రక్రియలో కుట్ర ఉందని మొదటి నుండి లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ దేశ ప్రజలకు చెప్తూ ప్రయత్నించిన నిజం, బీజేపి పార్టీ దుర్మార్గపు ఆలోచన ఇప్పుడు బయటపడిందన్నారు.

## జీరో యాక్సిడెంట్ జోన్ గా మెదక్ ను తీర్చిదిద్దాలి

**డ్రగ్స్ రహిత సమాజమే మనందరి లక్ష్యం.. కలెక్టర్ ప్రతిమా సింగ్**




**ముద్ర ప్రతినిధి, మెదక్:** జీరో యాక్సిడెంట్ జోన్ గా మెదక్ ను తీర్చిదిద్దుతూ మాదక ద్రవ్యాలు నియంత్రణపై పట్టు బిగించాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు.మంగళవారం రోడ్డు ప్రమాదాల నివారణ, మాదకద్రవ్యాల నిర్మూలనపై అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, జిల్లా అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ... జీరో యాక్సిడెంట్ జోన్ గా మెదక్ ను తీర్చిదిద్దాలని, మాదకద్రవ్యాల నిర్మూలనకు పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. రోడ్డు భద్రత, మాదకద్రవ్యాల నిరోధం అనేవి సమాజ రక్షణలో అత్యంత కీలకమైన అంశాలన్నారు.గత సమావేశంలో చర్చించిన అంశాలపై ఆర్ అండ్ బి నేషనల్ హైవే సమన్వయంతో చేపట్టిన అంశాలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ ఎల్లయ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి గణేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## నేషనల్ సైన్స్ సెమినార్ కు పూజశ్రీ ఎంపిక

**ముద్ర ప్రతినిధి, మెదక్:** రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ హైదరాబాద్ లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్ లో "భారతీయ ఇంధన వనరుల సముదాయం 2047– అవకాశాలు సవాళ్లు" అనే అంశంపై విద్యార్థులు వారి యొక్క సెమినార్ పత్రాలను ప్రజెంట్ చేశారు. ఇందులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముస్లాపూర్ విద్యార్థిని పూజ శ్రీ మొదటి స్థానం సాధించింది. రాష్ట్ర విద్య పరిశోధన శిక్షణ సంస్థ డైరెక్టర్ గాజర్ల రమేష్ మెమెంటో, నగదు పురస్కారంతో సత్కరించారు. ఇదే స్ఫూర్తితో అక్టోబర్ 30న ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి సెమినార్లో రాణించాలని ఆకాంక్షించారు. పూజ శ్రీని జిల్లా విద్యాధికారి రాజు, అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శనమూర్తి, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ లు అభినందించారు.




## బాలల సంరక్షణపై అధికారులకు అవగాహన సదస్సు

**ముద్ర, సూర్యాపేట:** బాలల సంరక్షణ, వారి సమస్యల పరిష్కారంలో అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో యూనిసెఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అధికారులకు బాలల సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా బాలలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు, వాటి మధ్య ఉన్న వ్యత్యాసాలు, సామాజిక వ్యవస్థలు పిల్లలపై చూపుతున్న ప్రభావం, బాలల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై చర్చించారు. ప్రభుత్వ శాఖల వద్ద ఉన్న గణాంకాలు, క్షేత్రసాయి పరిస్థితులను సమీక్షించారు.కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బాలల సమస్యల పరిష్కారంలో ఎలాంటి లోపాలు లేకుండా ప్రతి శాఖ తన బాధ్యతగా తీసుకుని పనిచేయాలని అన్నారు. డ్రగ్స్, బాల్య వివాహాలు లేని గ్రామాల ఏర్పాటుకు అధికారులు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. సదస్సులో చర్చించిన అంశాలపై ప్రతి శాఖ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు.యూనిసెఫ్ హైదరాబాద్ రిసోర్స్ పర్సన్ ఫిలిప్స్ మాట్లాడుతూ పిల్లల సమస్యలపై వివిధ ప్రభుత్వ శాఖలు సమన్వయంతో స్పందించాల్సిన తీరును వివరించారు. బాలల సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు శాఖల వారీగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించడం, క్షేత్రస్థాయిలో పిల్లలు, ప్రజల్లో అవగాహన కల్పించడంపై అధికారులకు సూచనలు చేశారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.హరి సింగ్, అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, డీఆర్వో ప్రేమ్‌రాజ్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు రవితేజ, అనుష, టి.వసంత్, డీడబ్ల్యూఓ కె.నరసింహారావు, బీసీ సంక్షేమ శాఖ అధికారి విశాల్‌ధార్, ఆర్డీఓ పురుషోత్తంరెడ్డి, డీఐఈఓ సులోచనరాణి, డీవైఎస్ఓ వెంకట్‌రెడ్డితో పాటు పోలీస్, రవాణా, ఫైర్ సేఫ్టీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### వరల్డ్ హార్ట్ డే సందర్భంగా

# ‘వన్ మినిట్ హార్ట్ ఛాలెంజ్’

**ముద్ర, హైదరాబాద్:** వరల్డ్ హార్ట్ డే సందర్భంగా యశోద హాస్పిటల్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్ నగరవ్యాప్తంగా నిర్వహించిన ‘1 మినిట్ హార్ట్ ఛాలెంజ్’కు విశేష స్పందన లభించింది. గుండె ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు రోజువారీ జీవితంలో శారీరక చురుకుదనాన్ని పెంచుకోవాలనే సందేశంతో కేబీఆర్ పార్క్, బొటానికల్ గార్డెన్స్, ట్యాంక్‌బండ్, కమ్యూనిటీ సెంటర్లు, సికింద్రాబాద్ క్లబ్, జిమ్‌లు, యశోద హాస్పిటల్స్‌కు చెందిన నాలుగు యూనిట్లలో కార్యక్రమాలు నిర్వహించారు.చిన్నారుల నుంచి వృద్ధుల వరకు వేలాది మంది ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ కార్యక్రమంలో పాల్గొని తమ మద్దతు తెలిపారు.ట్రెడ్‌మిల్, స్టేషనరీ సైక్లింగ్, స్కిప్పింగ్, పుష్‌అప్స్ వంటి వ్యాయామాల్లో పాల్గొన్న వారికి వైద్యులు, ఫిజియోథెరపిస్టులు, నర్సులు, ఈఎంఆర్ బృందం పర్యవేక్షణ అందించింది. వివిధ విభాగాల్లో ఒక నిమిషంలో అత్యధిక కేలరీలు ఖర్చు చేసిన వారికి ప్రత్యేక బహుమతులు అందజేశారు.యశోద హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి మాట్లాడుతూ.. వ్యాయామానికి ఎక్కువ సమయం కేటాయించలేని వారు కూడా రోజువారీ జీవితంలో చిన్నచిన్న మార్పుల ద్వారా శారీరక చురుకుదనాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. లిఫ్ట్‌కు బదులుగా మెట్లు ఉపయోగించడం, ఎక్కువసేపు కూర్చుని పనిచేసే సమయంలో మధ్యలో కొద్దిసేపు నడవడం, తరచూ నిలబడటం వంటి అలవాట్లు ఆరోగ్యానికి ఉపయోగపడతాయని చెప్పారు.క్రమమైన శారీరక శ్రమ గుండె ఆరోగ్యంతో పాటు మొత్తం శరీర ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కీలకమని తెలిపారు. వ్యాయామానికి ఎక్కువ సమయం అవసరం లేదనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే ‘1 మినిట్ హార్ట్ ఛాలెంజ్’ ఉద్దేశమని డాక్టర్ పవన్ గోరుకంటి పేర్కొన్నారు.

## క్లస్టర్–3లో మెదక్ షీటీమ్ కు ప్రథమ స్థానం

**అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్**



**ముద్ర ప్రతినిధి, మెదక్:**మహిళల భద్రత, ఈవ్‌టీజింగ్ నివారణ, అవగాహన కార్యక్రమాల్లో మెదక్ జిల్లా షీ టీం అత్యుత్తమ ప్రతిభ కనబరిచి క్లస్టర్–3లో ప్రథమ స్థానంలో నిలిచింది. గత ఎనిమిది నెలలుగా షీ టీం చేపట్టిన నిరంతర పర్యవేక్షణ, అవగాహన కార్యక్రమాలు, సమర్థవంతమైన చర్యలకు ఈ గుర్తింపు నిదర్శనమని అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ తెలిపారు.మహిళలు, బాలికల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ విద్యాసంస్థలు, బస్టాండ్లు, రద్దీ ప్రాంతాల్లో నిఘా కొనసాగిస్తున్నట్లు చెప్పారు. ఈవ్‌టీజింగ్, మహిళల వేధింపులను అరికట్టడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు.ప్రథమ స్థానం సాధించిన షీ టీమ్ సిబ్బందిని అదనపు ఎస్పీ అభినందించారు. భవిష్యత్‌లోనూ ఇదే స్ఫూర్తితో పనిచేసి మహిళలకు మరింత భద్రత కల్పించాలని సూచించారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555